# వైయస్ఆర్-అన్నమయ్య
తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
శనివారం 21 జూన్ 2025


## యోగాసనాలతో సంపూర్ణ ఆరోగ్యం..

కడప కార్పొరేషన్, జూన్ 20 ప్రభాతవార్త:



యోగా ఆసనాలతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని, మనస్సుకు ప్రశాంతత లభిస్తుందని, ఏకాగ్రత పెరిగి విద్యార్థులు చదువులో బాగా రానిస్తారని వ్యాయామ ఉపాధ్యాయుడు శివ శంకర్ రెడ్డి అన్నారు. 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు గంగనపల్లి జిల్లా పరి షత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థినీ విద్యార్థులు, ఉపాధ్యాయులందరూ యోగా విన్యాసాలు నిర్వహించారు. వ్యాయామ ఉపాధ్యాయుడు శివ శంకర్ రెడ్డి పచ్చిమూత్తాసనము పైన మయూరాసనం ఆకర్షించింది. అలాగే విద్యార్థినీ విద్యార్థులు అనేక రకాల యోగాసనం విన్యాసాలు చేశారు.

## కమిషనర్ కు వినతి..

కడప కార్పొరేషన్ జూన్ 20 ప్రభాతవార్త:

కడప నగరపాలక సంస్థ సర్వసభ్య సమావేశానికి నగర మేయర్, డిప్యూటీ మేయర్ల తో పాటు అధిక శాతం కార్పొరేటర్లు హాజరుకాలేదని, కోరం లేదని, కనుక కడప నగర పాలక సంస్థ సర్వసభ్య సమావేశం జరగలేదని ఎమ్మెల్యే మాధవి రెడ్డి 8 మంది కార్పొరేటర్లు అన్నారు. శుక్రవారం కమిషనర్ మనోజ్ రెడ్డి ని 8 ముంది కార్పొరేటర్ లు కలిసి వినతి పత్రం అందించారు. భవిష్యత్తులో జరగబోయే సమావేశాన్ని ముందస్తు నోటీసు ద్వారా సభ్యులం దరికీ తెలియజేసి సభను నిబంధనల ప్రకారం నిర్వహించాలని కోరారు.



# యోగ ...యోగ ... యోగ ...

### అన్ని స్కూళ్లలో... ప్రభుత్వ క్రీడా మైదానాల్లో...
### గిన్నిస్ బుక్ రికార్డ్ సాధనకు బాసటగా...
### రాయచోటిలో 5000 మందితో యోగాంధ్ర

రాజంపేట జూన్ 20 ప్రభాతవార్త:

యోగ... ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగ సంపూర్ణ ఆరోగ్యానికి నేడు వినిపించే ప్రధాన నినాదం. నిత్య జీవితంలో యోగ భాగం కావాలని పిలుపునిస్తున్నారు. మానవ జీవితంలో ఆరోగ్య విషయంలో మార్పుకు యోగాను మించిన ఆయుధం మరొకటి లేదని పిలుపునిస్తున్నారు. మన దేశమే కాదు.. యావత్ ప్రపంచం యోగాను అనుసరిస్తుందంటే యోగ వల్లఎంత మార్పు వచ్చిందో అర్థం చేసుకోవచ్చు. ఒకప్పుడు బుషి పుంగవులు భారత్ లో సూర్య నమస్కారాలతో పరిచయం చేసిన యోగ నేడు విశ్వవ్యాప్తమైంది. ప్రధాని మోడీ నాయకత్వంలో యోగా జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం గా మార్చగలిగారంటే యోగా కున్న పవర్ అలాంటిది. యోగ అంటే ఒక ఆయుధం. యోగ అంటే ఒక సాధనం. అందుకే ప్రపంచవ్యాప్తంగా యోగా దినోత్సవం నిర్వహిస్తున్నారు. రాష్ట్రంలో యోగా సాధనపై విస్తృత ప్రచారం చేసి యోగాంధ్రతో సంపూర్ణ ఆరోగ్య ఆంధ్రగా మార్చాలన్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అకుంఠ దీక్షతో ప్రధాని మోడీని విశాఖకు రప్పించి ఒకే వేదికపై మూడు లక్షల మంది నుంచి ఐదు లక్షల మంది తో యోగాసనాలు వేయడం ద్వారా ప్రపంచ రికార్డును నెలకొల్పడమే కాకుండా రాష్ట్రంలో ఏకంగా రెండు కోట్ల మంది యోగ అనుసరించేలా వ్యూహాత్మకంగా పక్కా ప్రణాళికతో రంగం సిద్ధం చేశారు. వరల్డ్ రికార్డుకు చేరువుగా, బాసటగా నిలిచారు. అన్ని విద్యాసంస్థల్లో కూడా నేడు యోగ సాధన గంటపాటు చేయాలని సర్క్యులర్లు వచ్చాయి. అన్ని ప్రభుత్వ క్రీడ మైదానాల్లో పెద్ద ఎత్తున యోగ సాధన చేసేలా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ప్రభుత్వ ఉద్యోగులు కాదు ప్రైవేట్ సంస్థలు సైతం యోగాను అనుసరించేలా ప్రచారం




చేస్తున్నారు. అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటిలో ప్రభుత్వ క్రీడమైదానంలో 5000 మందితో యోగాంధ్ర కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ చామకూరి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. అన్ని విద్యాసంస్థలు ప్రజలు తరలివచ్చి యోగాంధ్రలో పాల్గొనాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. రాజంపేట ప్రభుత్వ క్రీడ మైదానంలో స్థానిక న్యాయమూర్తులతో పాటు వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో యోగ అభిమానులు పెద్ద ఎత్తున తరలిరావాలని నిర్వాహకులు ఏర్పాటు చేస్తున్నారు.

### ఒంటిమిట్ట ,పులివెందుల జడ్పిటిసి ఎన్నికకు
## ఎన్నికల కమిషన్ ఆదేశాలు

### ఈనెల 30న ఓటర్ల జాబితా ప్రకటించాలని ఉత్తర్వులు

రాజంపేట జూన్20 ప్రభాతవార్త:




జిల్లాలో ఖాళీ అయిన ఒంటిమిట్ట ,పులివెందుల జడ్పిటిసి స్థానాలకు ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నీలం సహాని ఉత్తర్వులు జారీ చేశారు. ఈనెల 30న ఈ రెండు ప్రాదేశిక నియోజకవర్గం ప్రకటించాలని శుక్రవారం ఆమె ఆదేశించారు. ఒంటిమిట్ట జెడ్పిటిసిగా ఉన్న ఆకేపాటి అమరనాథ్ రెడ్డి జెడ్పీ చైర్మన్గా ఎన్నికై ఆ తర్వాత గత ఏడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో శాసనసభ్యులుగా గెలుపొందారు. దీంతో ఆయన జెడ్పిటిసి సభ్యత్వానికి రాజీనామా చేశారు. ఫలితంగా ఒంటిమిట్ట జడ్పిటిసి స్థానంకు ఎన్నికలు నిర్వహించే పరిస్థితి ఏర్పడిం.ది అలాగే పులివెందుల జడ్పిటిసి మహేశ్వర్ రెడ్డి ఓ ప్రమాదంలో మరణించారు .దీంతో అక్కడ కూడా ఎన్నికలు నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది .దీంతో రాష్ట్ర ఎన్నికల సంఘం రెండు స్థానాలు రెండు జెడ్పిటిసిలకు ఎన్నికలు నిర్వహించేందుకు ఉత్తర్వులు జారీ చేసింది. పులివెందుల స్థానం వైసీపీ అధినేత జగన్మోహన్ రెడ్డికి ప్రతిష్టాత్మకంగా మారింది. టిడిపి కూడా అధికారంలో ఉన్న నేపథ్యంలో అక్కడ గెలుపు సవాల్ గా తీసుకొని పనిచేయాల్సింది. మరోవైపు ఒంటిమిట్ట జడ్పిటి స్థానం వైసిపి దే కావడం వల్ల ఆ పార్టీకి అక్కడ గెలుపు కీలకం కానుంది. మరోవైపు అధికార టిడిపికి ఉంటే ఒంటిమిట్టలో గెలుపు సాధించేందుకు సర్వశక్తులు ఒడ్డి పని చేయాల్సి ఉంది. మాజీ ముఖ్యమంత్రి కి సొంత జిల్లా కావడం, గత ఎన్నికల్లో టిడిపికి ఊహించని విధంగా పులివెందుల, రాజంపేట, బద్వేలు అసెంబ్లీ మినహా మిగతా మారిందిఆ పార్టీకి కూడా రెండు స్థానాల్లో గెలుపు సవాలె అని చెప్పవచ్చు. అందులోనూ రెండు స్థానాలు కడప జిల్లాలోనే ఉండడం విశేషం.

## తల్లికి వందనంపై వైకాపా బులుగు విషం కక్కుతున్నది

రాయచోటి, జూన్ 20 ప్రభాత వార్త

వైసీపీ పాలనలో రూ.13 వేలు ఇచ్చారు. అంటే అప్పుడు రూ.2 వేలు జగన్ జేబుల్లోకి పోయాయా? తాడేపల్లి ప్యాలెస్కు చేరాయా అని గాజుల ఖాదర్బాషా పేర్కొన్నారు. శుక్రవారం నాడు ఆయన ఒక పత్రిక ప్రకటన విడుదల చేశారు.. జగన్ పాలనలో 42 లక్షల మందికి మాత్రమే ఇస్తే కూటమి ప్రభుత్వం ఇప్పుడు 67.27 లక్షల మంది విద్యార్థులకు తల్లికి వందనం ఇస్తుంది. కుటుంబంలో ఒక్కరికే అనే షరతు పెట్టి పేద, మధ్య తరగతి విద్యార్థులను, వారి తల్లిదండ్రులను జగన్ మోహన్ రెడ్డి మానసికంగా వేధింపులకు గురి చేసిన విషయం వాస్తవం కాదా అని ప్రశ్నించారు. 2019 ఎన్నికల ప్రచారంలో "మీ ఇంట్లో ఇద్దరు పిల్లల్ని బడికి పంపండి ఒక్కొక్కరికరూ.15వేల చొప్పున ఇస్తాము" అంటూ జగన్ రెడ్డి ప్రచారం చేయలేదా?.. అధికారంలోకి వచ్చాక ప్రతి కుటుంబంలో ఒక్క విద్యార్థికే రూ.13వేలు ఇస్తామంటూ మాయమాటలు చెప్పలేదా మరియు పారదర్శకతకు పెద్దపీట వేస్తూ అర్హత ఉన్న ప్రతి విద్యార్థికీ లబ్ది చేకూరుస్తుంటే బెంగళూరులో కూర్చొని జగన్ రెడ్డి విష ప్రచారం చేస్తున్నారని చెప్పారు. ఇప్పటికైనా వైసీపీ నాయకులు ఇటువంటి విమర్శలు మానుకోవాలని హితవుపలికారు.

# తెరపైకి మరోసారి కుర్చీల వివాదం..

### హాలు బయటే సమావేశం..
### ఎమ్మెల్యేకి తొత్తులుగా అధికారులు : మేయర్
### నిబంధనలకు విరుద్ధం : ఎమ్మెల్యే మాధవి రెడ్డి..

కడప కార్పొరేషన్, జూన్ 20 ప్రభాతవార్త:

కడప నగరపాలక సంస్థ సర్వసభ్య సమావేశంలో మరోసారి కుర్చీ వివాదం తెరపైకి వచ్చింది. ఇప్పటికే రెండుసార్లు జరిగిన సమావేశంలో తెదేపాకు చెందిన కడప ఎమ్మెల్యే మాధవి రెడ్డికి కుర్చీ లేకుండా చేయడంపై తీవ్ర వివాదం నెలకొన్న సంగతి తెలిసిందే. సమావేశ మందిరంలో మేయర్ కుర్చీ పక్కన ఎక్స్ అఫీసియో హోదాలో ఎమ్మెల్యేలకు, ఎమ్మెల్సీలకు కమిషనర్ కుర్చీలను ఏర్పాటు చేశారు. మధ్యలో మేయర్ కుర్చీ ఉండగా.. దానికి ఇరువైపులా ఎమ్మెల్యేలు. ఎమ్మెల్సీలు కూర్చొనేందుకు కేటాయించారు. శుక్రవారం ఉ.11గం.లకు సర్వసభ్య సమావేశం జరిగే కౌన్సిల్ హాల్లోకి రాకుండా తన చాంబర్లోనే మేయర్ సురేష్ బాబు, వైసీపీ సభ్యులు వెళ్లారు. మేయర్ సురేష్ బాబు, వైసీపీ పాలకవర్గ సభ్యులు ఒక హాల్లో.. ఎమ్మెల్యే మాధవి రెడ్డి తన మద్దతుదారులైన సభ్యులతో సమావేశం హాల్లో కూర్చున్నారు. ఈ సందర్భంగా నగర మేయర్ సురేష్ బాబు మాట్లాడుతూ తన ప్రమేయం లేకుండా కమీషనర్ మీటింగ్ హాల్లో సమావేశం ఎలా నిర్వహిస్తారని ప్రశ్నించారు. సమావేశం పలానా చోట నిర్వ హించాలని ఎక్కడా లేదని.. ప్రాంగణంలో నిర్వహిస్తామని కమిషనర్కు లెటర్ పంపామని తెలిపారు. కార్పొరేషన్ కాన్ఫరెన్స్ హాల్లో సమావేశం నిర్మించాలని, అందుకు భద్రత కల్పించాలని హైకోర్టు ఆదేశించిందన్నారు. కమిషనర్, ఉద్యోగులు.. ఎమ్మెల్యే తొత్తులుగా వ్యవహరిస్తున్నారని మేయర్ సురేష్ బాబు ఆరోపించారు. ఈ గందరగోళం నేపథ్యంలో ఇటు ఎమ్మెల్యే, అటు మేయర్ అధికారులు చర్చలు జరిపిన ఫలించలేదు. కాన్ఫరెన్స్ హాల్ తాళాలు ఇవ్వకపోవడంతో హాలు బయటే మేయర్ సురేష్ బాబు, కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులతో సమావేశం నిర్వహించారు. మరోవైపు నిబంధనలకు





విరుద్ధంగా అలా ఎలా సమావేశం నిర్వహిస్తారని ఎమ్మెల్యే మాధవీరెడ్డి, తెదేపా కార్పొరేటర్లు ప్రశ్నించారు. అయితే ఈ సమావేశ నిర్వహణపై కమిషనర్ స్పష్టత ఇవ్వలేదు.

### ఒకరిపై ఒకరు ఆరోపణలు

తమకు అధికారులు సహకరించలేదని ఎమ్మెల్యే చెప్పినట్లు అధికారులు నడుచుకుంటున్నారని కడప మేయర్ సురేష్ బాబు ఆరోపించారు. సమావేశానికి కోరం సభ్యులు హాజరయ్యారని, అందరం తీర్మానాలు చేసుకున్నామని, దీనిపై హైకోర్టుకు నివేదిస్తానని ఆయన చెప్పారు. మరొక వైపు నిబంధనలకు విరుద్ధంగా సమావేశం ఎలా నిర్వాహిస్తారన్న ఎమ్మెల్యే మాధవిరెడ్డి అభ్యంతరం తెలిపారు. సమావేశంపై ఎమ్మెల్యే మాధవిరెడ్డి మండిపడ్డారు.

### భారీ బందోబస్తు

కార్పొరేషన్ కార్యాలయం వద్ద ఇద్దరు డీఎస్పీలు, 12 మంది సీఐలు, 20 మంది ఎస్ఐ, 53 ఏఎస్ఐ, 110 కానిస్టేబుల్, 4 స్పెషల్ పార్టీ బృందాలతో భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. అలాగే కార్పొరేషన్ కార్యాలయం చుట్టూ ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. కార్పొరేటర్లు తప్ప ఇతరులు ఎవరికీ కూడా లోనికి వెళ్లేందుకు పోలీసులు అనుమతి ఇవ్వలేదు.

### ఎమ్మెల్యే మేయర్ మధ్య వివాదం

గత ఆరు నెలలుగా మేయర్ సురేష్ బాబు, కడప ఎమ్మెల్యే మాధవీరెడ్డి మధ్య వివాదం నడుస్తోంది. కార్పొరేషన్లో నిబంధనలకు విరుద్ధంగా మేయర్ కుటుంబం చేసిన కాంట్రాక్టు పనులపై వివాదం చెలరేగింది. మేయర్పై మున్సిపల్ శాఖ ప్రత్యేక కార్యదర్శి అనర్హత వేటు వేశారు. ఈ క్రమంలో హైకోర్టుకు వెళ్లిన మేయర్ అభివృద్ధికి ఆటంకం కలుగుతోందని, సర్వసభ్య సమావేశం జరగాలని కోరారు. దీంతో హైకోర్టు నుంచి స్టే తెచ్చుకున్న మేయర్ శుక్రవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ఎక్స్ అఫీసియో హోదాలో సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్యే మాధవీ రెడ్డి హాజరయ్యారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు, కార్పొరేటర్లు, కో ఆప్షన్ మెంబర్లు, అధికారులు పాల్గొన్నారు.

## సాగునీటి రంగంపై చంద్రబాబువి అనాలోచిత నిర్ణయాలు

వేంపల్లి: జూన్ 20 (ప్రభాత వార్త):



గోదావరిలో పుష్కలంగా నీళ్ళున్నాయ్,తెలంగాణా ప్రాజెక్టులు కట్టుకోవచ్చు, నేను అభ్యంతరం చెప్పను అని ముఖ్య మంత్రి చంద్ర బాబు చెప్పడం అనాలోచితం,దిగువ రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్ కు పెను ప్రమాదమని రాజ్య సభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్. తులసి రెడ్డి అన్నారు.శుక్రవారం వేంపల్లి లో మీడియా సమావేశంలో మాట్లాడుతూ 75 శాతం విశ్వసనీయత ఆధారంగా గోదావరి నది లో 3000 టీఎంసీ ల నికర జలాలు వుంటాయని బచావత్ ట్రిబ్యునల్ అవార్డు ఇచ్చింది అన్నారు. ఈ నికర జలాలను మహారాష్ట్రకు 889 టీఎంసీ లు, కర్నాటకకు 20, ఛత్తీస్ ఘడ్ కు 625, ఒరిస్సా కు 293, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కు పునరుత్పత్తి జలాలతో కలిపి 1480 టీఎంసీ లు కేటాయించింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కు కేటాయించిన 1480 టీఎంసీ లలో ప్రాజెక్టుల వారీగా తెలంగాణ ప్రాజెక్టులకు 710 టిఎంసి లు,ఆంధ్ర ప్రదేశ్ ప్రాజెక్టులకు 770 టీఎంసీ లు కేటాయించింది. తెలంగాణా లోని సింగూర్, నిజాం సాగర్, శ్రీరామ్ సాగర్,కడెం,మిడ్ మానేర్, ఎల్లం పల్లి, సుందేళ్ల, అన్నారం,తుమ్మిడి హట్టి, కాళేశ్వరం,తుపాకుల గూడెం, సీతా రామ, ఇచ్చం పల్లి ప్రాజెక్టులకు 710 టీఎంసీ లను కేటాయించింది. ఆంధ్ర ప్రదేశ్ లో పోలవరం ప్రాజెక్టుకు 385, గోదావరి డెల్టాకు 264 టీఎంసీ ల నికర జలాలు కేటాయించింది. బచావత్ ట్రిబ్యునల్ వున్న నికర జలాలను వివిధ రాష్ట్రాలకు కేటాయించింది.ఇక గోదావరి లో నికర జలాలు లేవు .ఈ నేపథ్యంలో గోదావరిలో పుష్కలంగా నీళ్లున్నాయ్, తెలంగాణా ప్రాజెక్టులు కట్టుకోవచ్చు, నేను అభ్యంతరం చెప్పను అని చెప్పడం అవివేకం, అవగాహనా రాహిత్యం. వరద జలాలు వుండచ్చు, వుండక పోవచ్చు. వుండినా మిగులు జలాలు వాడుకునే స్వేచ్ఛ దిగువ రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్ కు మాత్రమే వుంటుంది.ఎగువ రాష్ట్రమైన తెలంగాణకు వుండదు. ఎగువ రాష్ట్రమైన తెలంగాణ కేటాయించిన 710 టీఎంసీ లకు మించి నీటిని వాడుకుంటే పోలవరం ప్రాజెక్టుకు,గోదావరి డెల్టాకు నీళ్ళు రాని ప్రమాదం ఉంటుంది. పోలవరం బనక చర్ల ప్రాజెక్టు ఆంధ్ర ప్రదేశ్ కు గుది బండ అవుతుంది.ఇది ఆచరణ సాధ్యం కాదు.మరో కాళేశ్వరం అవుతుంది.రాష్ట్రం అప్పుల కుప్ప అవుతుంది. అసంపూర్తిగా వున్న ప్రాజెక్టులకు నిధులు కేటాయించి పూర్తి చేసుకొని తర్వాత పోలవరం బనక చర్ల గురించి ఆలోచించుకో వచ్చు. ప్రస్తుతానికి పోలవరం బనక చర్ల ఆలోచన విరమించుకోవాలని తులసి రెడ్డి ప్రభుత్వానికి సూచించారు.

## యోగాంధ్ర కార్యక్రమం ఏర్పాటను పరిశీలించిన రితేష్ రెడ్డి



బద్వేలు, జూన్ 20, ప్రభాతవార్త

బద్వేల్ టౌన్ నందు శనివారం జరగబోవు యోగాంధ్ర కార్యక్రమ ఏర్పాట్లను బద్వేల్ నియోజకవర్గ టీడీపీ ఇన్చార్జ్ రితేష్ రెడ్డి మరియు రెవెన్యూ డివిజనల్ అధికారి చంద్రమోహన్ , గోపవరం మున్సిపల్ కమిషనర్, బద్వేల్ తహసిల్దార్, పోలీస్ అధికారులు ఇతర అధికారులతో కలిసి పరిశీలించారు. బద్వేల్ వీరారెడ్డి కళాశాల నందు జరగబోయే ఈ కార్యక్రమానికి నియోజకవర్గ నలుమూలల నుంచి 5000 మందితో భారీగా నిర్వహించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనే వారికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని అధికారులకు, కాలేజీ ఉద్యోగులకు రితేష్ రెడ్డి దిశా నిర్దేశం చేశారు.

## అంధకారంలో చిన్న గోపవరం

గోపవరం, జూన్ 20, ప్రభాతవార్త

గోపవరం మండలం చిన్న గోపవరం గ్రామంలో నెలరోజులుగా దీపాలు వెలగకపోవడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయాన్ని పంచాయతీ అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదంటున్న గ్రామస్తులు తెలుపుతున్నారు. ఇప్పటికైనా పై అధికారులు స్పందించి గ్రామంలో వీధి దీపాలను పునరుద్ధించాలని గ్రామస్తులు కోరుతున్నారు



## వేంపల్లె లో ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పంద

వేంపల్లి: జూన్ 20 (ప్రభాత వార్త):



వేంపల్లె లో అవోపా,అవోపా మహిళా విభాగ్ మరియు కడపకు చెందిన సుధా టెస్ట్ ట్యూబ్ బేబీ సెంటర్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత సంతాన సాఫల్య శిబిరం నిర్వహించామని అవోపా అధ్యక్షుడు బైరిశెట్టి వెంకట సునీల్ కుమార్, అవోపా మహిళా విభాగ్ అధ్యక్షురాలు పచ్చిపులుసు ప్రవీణ తెలిపారు.వారు మాట్లాడుతూ గురువారం వేంపల్లె పట్టణంలోని శ్రీ వాసవి కల్యాణ మండపంలో నిర్వహించిన ఈ వైద్య శిబిరంలో కడప కు చెందిన ప్రముఖ సంతాన సాఫల్య నిపుణురాలు డా.సామాసుధ దాదాపు 53 మందికి స్త్రీలకు సంబంధించిన గైనిక్ సమస్యలకు ఉచితంగా వైద్యం అందించారని తెలిపారు.అనంతరం తగిన మందులు ఉచితంగా పంపిణీ చేశారని తెలిపారు.అవోపా ద్వారా నిర్వహిస్తున్న వివిధ సేవలపై ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. రాబోయే కాలంలో మరిన్ని సేవలు అందించేందుకు కృషి చేస్తామని అవోపా కార్యవర్గ సభ్యులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అవోపా కార్యవర్గం,అవోపా మహిళా విభాగ్ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## ఐటిఐ సీట్లు కు దరఖాస్తు చేసుకోండి

### ఐటిఐ ప్రిన్సిపాల్ ప్రసాద రావు

వేంపల్లి: జూన్ 20 (ప్రభాత వార్త):



జూన్ 20 (ప్రభాత వార్త): వేంపల్లి లోని శ్రీ కందుల ఓబుళరెడ్డి చారిటీస్ ఐటిఐ లో మిగిలి వున్న సీట్లు కు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ఐటిఐ ప్రిన్సిపాల్ ప్రసాద రావు ఒక ప్రకటనలో కోరారు. వేంపల్లి ఐటిఐ లో ఫిట్టర్, సివిల్, వెల్డర్, డీజిల్ మెకానిక్ మరియు ప్లంబర్ కోర్స్ లు కలవని తెలిపారు. ప్లంబర్ కోర్స్ లో చేరడానికి 8 వ తరగతి చదివి ఉండాలని మిగిలిన వాటికి 10వ తరగతి పాస్ అయివుండాలని తెలిపారు. రెండవ విడత అడ్మిషన్స్ కు ప్రభుత్వం నోటిఫికేషన్ ఇచ్చిందని జులై 14వ తేదీ లోగ దరఖాస్తు చేసుకోవాలని జులై 23 న ఇంటర్వ్యూలు వేంపల్లి ఐటిఐ లో వుంటాయని తెలిపారు. జిల్లా లో పారిశ్రామిక అభివృద్ధి ఉందని రెండు సంవత్సరాల లో పరిశ్రమలు వచ్చే అవకాశం ఉన్నందున ఫిట్టర్ వెల్డర్ కోర్స్ లకు ఉద్యోగ అవకాశలు ఉన్నాయని తెలిపారు. రైల్వే, ఆర్ టీ సి లో డీజిల్ మెకానిక్ అభ్యర్థుల కు మంచి అవకాశాలు ఉన్నాయని చెప్పారు. ప్లంబర్ కోర్స్ చేసిన వారికి గ్రామ పంచాయతీలు, మునిసిపల్ కార్యాలయం లో ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని ఐటిఐ చదివిన అభ్యర్థుల కు ఉద్యోగ అవకాశాలు బాగా ఉన్నాయని తల్లి తండ్రులు అలోచించి తమ పిల్లలను చేర్చాలని కోరారు.

## రాజంపేట సర్వేయర్గా వెంకటసుబ్బ య్య



రాజంపేట జూన్20 ప్రభాతవార్త

రాజంపేట మండల సర్వేయర్ గా వెంకటసుబ్బయ్యను నియమిస్తూ సర్వే ల్యాండ్ రెవెన్యూ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. సుండుపల్లె సర్వేయర్ గా పని చేస్తూ ఇక్కడకు ఆయన బదిలీ అయ్యారు. ఈ మేరకు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం తాసిల్దార్ పీర్ మున్నీ తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా వెంకటసుబ్బయ్యను మండలంలోని సచివాలయాల సర్వేయర్లు ఘనంగా సన్మానించారు .

## జిల్లా అంతటా ఉత్సవ వాతావరణంలో యోగా కార్యక్రమాలు..

కడప జిల్లా, జూన్ 20 : (ప్రభాత వార్త):

రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతతో నిర్వహిస్తున్న యోగాంధ్ర లో భాగంగా అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని జూన్ 21న ఉత్సవ వాతావరణంలో నిర్వహించి విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి ప్రజలను కోరారు. శుక్రవారం కలెక్టరేట్ లోని వీసీ హాల్లో అంతర్జాతీయ యోగ దినోత్సవాన్ని పురస్కరించుకొని యోగాంధ్ర మాసోత్సవాలలో భాగంగా ఈ నెల 21 న గ్రామస్థాయి నుండి జిల్లా స్థాయి వరకు నిర్వహించే కార్యక్రమాల నిర్వహణపై జిల్లా కలెక్టర్, జిల్లా జాయింట్ కలెక్టర్ అతిథి సింగ్, డిఆర్ఓ విశ్వేశ్వర నాయుడు తో కలిసి విలేకర్ల సమావేశం నిర్వహించారు. విలేకరుల సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా మే 21 నుండి జూన్ 21వ తేదీ వరకు యోగాంధ్ర మాసోత్సవాలను నిర్వహించామన్నారు. జిల్లాలో యోగా మాసోత్సవాల్లో భాగంగా ఇది వరకే అనేక కార్యక్రమాలను వివిధ థీమ్లతో నిర్వహించి ప్రజల్లో యోగాపై అవగాహన కల్పించడం జరిగిందన్నారు.

## ఉన్మాదులను గుర్తించి అరెస్ట్ చేయాలి



**పీలేరు జూన్ 20 ప్రభాతవార్త :**
భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి. ఆర్ అంబేద్కర్ గారి విగ్రహం ధ్వంసం చేసిన కుల ఉన్మాదాలను గుర్తించి వెంటనే అరెస్ట్ చేయాలని భారతీయ అంబేద్కర్ సేన రాష్ట్ర ఉపాధ్యక్షులు పాలకుంట శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఈయన నేడు స్థానిక బాస్ కార్యాలయం నందు పాత్రికేయులతో మాట్లాడుతూ కె. వి పల్లి మండలం, గర్నిమిట్ట పంచాయతీ ,మల్లారపు వాండ్ల పల్లె సమీపంలో నల్లగుట్ట క్రాస్ వద్ద గత ప్రభుత్వంలో దళితులకు ఇండ్ల నిర్మాణం కొరకు హౌసింగ్ కాలనీ ఏర్పాటు చేయడంతో కొంతమంది దళితులు ఇంటి నిర్మాణం కోసం పునాదులు వేసి ఆ కాలనీ ఆవరణంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహాన్ని పెట్టి గత మూడు సంవత్సరాల నుంచి అంబేద్కర్ జయంతి, వర్ధంతి కార్యక్రమాలను ఘనంగా నిర్వహించేవారు అని,18 తేదీ అనగా బుధవారం రాత్రి గుర్తుతెలియని కుల ఉన్మాదులు అంబేద్కర్ విగ్రహం ధ్వంసం చేయడం చాలా బాధాకరం విషయమని, విగ్రహం ధ్వంసం చేసిన కుల ఉన్మాదులను త్వరగా గుర్తించి అరెస్ట్ చేసి, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అదేవిధంగా ప్రభుత్వ అధికార యంత్రాంగం ధ్వంసమైన అంబేద్కర్ విగ్రహం స్థానంలో కొత్త అంబేద్కర్ విగ్రహాన్ని పునఃప్రతిష్ఠించాలని లేనిపక్షంలో త్వరలో రాష్ట్రస్థాయి లో ఉన్న కుల సంఘాల నాయకులతో సంప్రదించి చలో కె. వి. పల్లి పిలుపునిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బాస్ నాయకులు ముల్లంగి కృష్ణయ్య, గుండ్లూరు రవీంద్ర,ముల్లంగి గురవయ్య, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ వినియోగమే కాదు... విక్రయించవచ్చు



**బద్వేలు అర్బన్, జూన్ 20 , ప్రభాత వార్త**
సోలార్ గ్రూప్ టాప్ ద్వారా అంతే విద్యుత్తును గృహ అవసరాలకు వినియోగించు కావడంతోపాటు మిగిలిన విద్యుత్తును మరల విద్యుత్ శాఖ వారికి విక్రయించవచ్చునని విద్యుత్ శాఖ సూపరింటెండింగ్ ఇంజనీర్ రమణ పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని విద్యుత్ సబ్ స్టేషన్ కాంపౌండ్ నందు ప్రధానమంత్రి సూర్యఘర్ ముఫ్త్ బిజిలి యోజన పథకం కింద సోలార్ పలకలు ఏర్పాటుపై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా సోలార్ రూఫ్ టాప్ యొక్క ఆవశ్యకతను వివరిస్తూ ఈ రూఫ్ టాప్ వలన మీ ఇల్లు ఒక విద్యుత్ ఉపకేంద్రం అవుతుందన్నారు .ఇందుకోసం తక్కువ నిర్మాణ వ్యయంతో కేవలం 8 వేలు చెల్లించి ఒక కిలో వాట్ సోలార్ రూఫ్ టాప్ ను ఏర్పాటు చేసుకోవచ్చని. అలాగే 2 కిలో వాట్లకు 16వేలు, మూడు కిలో వాట్లకు 21 వేలు తక్కువ మొత్తం చెల్లించి విద్యుత్ వినియోగించుకోవచ్చని ఇందుకు గాను ప్రభుత్వరంగ బ్యాంకులు 6.25 శాతం సబ్సిడి వడ్డీ రేటుతో రుణాలను అందిస్తున్నాయన్నారు. ఈ రుణం 5 సంవత్సరాలలో తీరిపోతుందని . సోలార్ నిర్మాణం పూర్తయిన తర్వాత సబ్సిడి మొత్తం మీబ్యాంకు ఖాతాకు జమ చేయబడుతుందన్నారు. 99 శాతు సోలార్ రూఫ్ టాప్పై సమస్యలు ఉండవని ఉచిత విద్యుత్ పొందవచ్చని అనంతరం కరపత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో నెడ్ క్యాప్ డెవలప్మెంట్ ఆఫీసర్లు ఎల్లారెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ భరణీ కృష్ణ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కులయప్ప, అసిస్టెంట్ ఇంజనీర్లు బద్వేల్ పట్టణ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ యోగా దినోత్సవం ..

**సుండుపల్లి, జూన్ 20, ప్రభాతవార్త :**
అంతర్జాతీయ యోగా వారోత్సవాలు భాగంగా మండల పరిధిలోని అన్ని గ్రామ సచివాలయాలు పరిధిలో 21 శనివారము అందరూ యోగ దినోత్సవం పాటించాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి సుధాకర్ రెడ్డి తెలియజేశారు. ఆయన మాట్లాడుతూ యోగా ఆసనాలు వేయడం వలన మానసిక ఉల్లాసం మెరుగైన జీవన విధానం కలబడుతుందన్నారు. ప్రభుత్వం వారి ఆదేశానుసారం అన్ని ప్రభుత్వ కార్యాలయాలలో యోగ దినోత్సవం పాటించాలని యోగా చేయడం ద్వారా మనిషికి సుఖవంతమైన ఆరోగ్యకరమైన జీవితం ఉంటుందని యోగా ద్వారా అనేక జబ్బులు దారిని పడకుండా మనిషి ఆరోగ్యవంతుడిగా ఉంటాడని కనుక ప్రజలందరూ యోగ రోజున పురస్కరించుకొని అందరూ తప్పకుండా పాల్గొనాలని ఆయన తెలియజేశారు.

## మలేరియాపై అవగాహణ ర్యాలీ



**దువ్వూరు, జూన్ 20, ప్రభాతవార్త:**
మండల కేంద్రమైన దువ్వూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని నీలాపురం సచివాలయం వద్ద మరియు దువ్వూరులోని గాంధీ నగర్ వీధిలో మలేరియా వ్యతిరక మాసోత్సవంపై అవగాహణ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్వైజర్ కె.వీరాంజనేయులు మాట్లాడుతూ మలేరియా మాసోత్సవం సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. అందరూ డ్రై డే ఫ్రైడే పాటించాలన్నారు. డెంగ్యూ జ్వరాలపై ప్రజలకు అవగాహణ కల్పించారు. దోమలు మన ఇండ్లలోని పాత టైర్లు, పాత కుండీలు, తొట్లు, కూలర్లు ప్రతి శుక్రవారం డ్రైడే ఫ్రైడే నిర్వహించాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలు అంబికా, వనజ, ఆశాలు పాల్గొన్నారు.

## రెవెన్యూ సేవలు ఎనలేనివి

**దువ్వూరు, జూన్ 20, ప్రభాతవార్త:**
ప్రజలకు, రైతులకు ఎనలేని రెవెన్యూ సేవలు అందిస్తున్నట్లు మండల తహసీల్దార్ సంజీవరెడ్డి తెలిపారు. శుక్రవారం రెవెన్యూ డే సందర్భంగా స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గతంలో పనిచేసిన వీఆర్వోలను ఘనంగా సన్మానించారు. ఈ సంధభ్బంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూలో ఎప్పటికి పనులు ఉంటాయని వాటిని పరిష్కరించేందుకు రెవెన్య సిబ్బంది కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటి తహసీల్దార్ కరీముల్లా, వేణుగోపాల్, జాన్సన్ పాల్గొన్నారు.

## వేగవంతంగా ప్రజా సమస్యలు పరిష్కారం

**రాజుపాళెం, జూన్ 20, ప్రభాతవార్త:**



ప్రభుత్వం ఆదేశాలనుసారం ప్రజా సమస్యలను వేగవంతంగా పారదర్శకంగా పరిష్కరిస్తామని తహసీల్దార్ వెంకటేశ్వర్లు తెలిపారు. మండల కేంద్రమైన రాజుపాళెంలో శుక్రవారం రెవెన్యూ డే సమావేశం తహసీల్దార్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సంధర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రైతులు ఇతర ప్రజా సమస్యలు మండల కార్యాలయాలకు రాకుండానే గ్రామాలలోని సచివాలయాలలోనే పరిష్కరించుటకు సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన ప్రభుత్వం విధానం అమలు జరుగుతున్నదని తెలిపారు. డిప్యూటి తహసీల్దార్ మనోహర్ రెడ్డి మాట్లాడుతూ భూ సంబంధిత సమస్యలు చాలా వరకు పరిష్కారం అయినట్లు తెలిపుతూ భూ భారతి, రీ సర్వే, రెవెన్యూలో వచ్చిన సమాల మార్పులు ఎంతో మేలని తెలిపారు. రైతు భూమి రికార్డుకు ఆధార్, ఫోన్ నెంబర్ అనుసంధానం విధానంతో మనకు తెలియకుండా మార్పులు జరగవని, కొనుగోలు అమ్మకాల సమయంలో రిజిష్టర్ చేయాలంటే ఆధార్ నంబర్ లింకు, వేలి గుర్తు తప్పనిసరి చేయడం వలన చాలా మంచిది అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ హుసేన్ రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ మస్తాన్ వలి, టిడిపి నాయకులు సానా వెంకటసుబ్బారెడ్డి, గ్రామ రెవెన్యూ అధికారులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## నలుగురు రెవెన్యూ ఉద్యోగులకు ఉత్తమ సేవా అవార్డు

**రాజుపాళెం, జూన్ 20, ప్రభాతవార్త:**
రెవెన్యూ డే సంధర్భంగా శుక్రవారం జమ్మలమడుగు డివిజనల్ రెవెన్యూ కార్యాలయంలో ఆర్డీఓ సాయి శ్రీ చేతుల మీదుగా ఉత్తమ సేవా ప్రశంసా పత్రాలను మండలానికి చెందిన నలుగురు అధికారులు అందుకున్నారు. వారు సీనియర్ అసిస్టెంట్ మస్తాన్ వలి, మండల పరిధిలో కొర్రపాడు, కూలూరు గ్రామ రెవెన్యూ అధికారులు జె.అశోక్‌కుమార్, వరదశేఖర్‌లకు, కొర్రపాడు, రాజుపాళెం గ్రామాల వీఆర్ఏలు జయపాల్, సూర్యనరసింహులు అందుకున్నారు. వారిని పలువురు అభినందించారు. రెవెన్యూ శాఖలో ఉత్తమ సేవలు అందించినందుకు గుర్తింపు లభించినందుకు ప్రశంసా పత్రాలు అందించినందుకు వారు ఎంతో గర్వంగా ఉందన్నారు.

## ప్రజా పాలనలో రెవెన్యూ శాఖ కీలకం



సమావేశంలో ప్రసంగిస్తున్న తహశీల్దార్

**కురబలకోట, జూన్ 20 ప్రభాతవార్త :**
ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో రెవెన్యూశాఖ కీలకంగా వహిస్తాందని కురబలకోట తహశీల్దార్ ధనంజనేయులు అన్నారు. శుక్రవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద రెవెన్యూ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ ప్రభుత్వం మంజూరు చేసే పథకాలను అమలు చేయడంలో, ప్రజలకు వివిధ సర్టిఫికెట్లు మంజూరు, భూ సమస్యలను పరిష్కరించడంలో పారదర్శకంగా నిర్వహించడం జరుగుతోందన్నారు. అర్హులైన వారికి పథకాలు అందేలా రెవెన్యూ సిబ్బంది చర్యలు చేపడుతోందన్నారు. ఈ దినోత్సవాన్ని పురస్కరించుకొని రిటైర్డు అయిన రెవెన్యూ ఉద్యోగులకు క్రిష్ణమూర్తిరావు, వెంకటరెడ్డిలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాజంపేట పార్లమెంటరీ బిసిసెల్ అధ్యక్షులు సురేంద్రయాదవ్, వైజి.రమణ, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ శేషాద్రిరావు, విఆర్ఓలు ఖాదర్ బాషా, మోహన్, శ్రీనివాసులు, ప్రతిభ, తేజశ్వని,సర్వేయర్ భువనేశ్వరి, రెవెన్యూ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

## సిసి కెమరాలు ఏర్పాటు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సిఐ

**కురబలకోట, జూన్ 20 ప్రభాతవార్త :**
మండలంలోని కళ్యాణ మండపాల్లో సిసి కెమరాలు ఏర్పాటు చేయాలని మదనపల్లె రూరల్ సిఐ సత్యనారాయణ అన్నారు. శుక్రవారం అంగళ్ళు లోని అవుట్‌పోస్టు పోలీస్‌స్టేషన్‌లో కళ్యాణ మండపాల యాజమానులతో సిఐ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళ్యాణ మండపాల్లో ఏడాది పొడవునా వివాహ, వివిధ శుభకార్యాలు జరుగుతుంటాయని వారి భద్రత కోసం కళ్యాణమండపాల ముందు, వెనుక వైపుల 30రోజుల్లోపు సిసి కెమరాలు ఏర్పాటు చేసుకోవాలని కోరారు. నిబంధనల మేరకు యజమానులు కళ్యాణ మండపాలను నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో ముదివేడు ఎస్ఐ దిలీఫ్‌కుమార్, కళ్యాణమండపాల యజమానులు, సిబ్బంది పాల్గొన్నారు.

## అనుమతిలేని భవన నిర్మాణాలకు నోటీసులు



పంచాయితీ సిబ్బందితో మాట్లాడుతున్న దృశ్యం

**కురబలకోట, జూన్ 20 ప్రభాతవార్త :**
గ్రామ పంచాయితీల అనుమతి లేకుండా నిర్మించే భవనాలకు నోటీసులు జారీ చేయాలని డిపిఓ రాధమ్మ ఆదేశించారు. శుక్రవారం ఆమె అంగళ్ళు గ్రామ పంచాయితీలో పర్యటించారు. ఈ సందర్భంగాఆమె మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు సక్రమంగా నిర్వహించాలన్నారు. కొత్తగా నిర్మించే భవనాలకు తప్పనిసరిగా పంచాయితీల అప్రూవల్స్ జరిగేలా చూడాలన్నారు. నిబంధనలు అతిక్రమించే భవన నిర్మాణాలకు నోటీసులు జారీచేసి నిలుపదల చేయించాలన్నారు. కొత్త భవనాలకు పన్నులను విధించి పంచాయితీల అభివృద్ధికి తోడ్పాటును అందించాలని గ్రామ సెక్రటరీలను కోరారు. అనంతరం చెత్తసంపద కేంద్రాన్ని సందర్శించి సంతృప్తిని వ్యక్త పరిచారు. ఆమెవెంట ఈఓఆర్డి తేజశ్వని, గ్రామ సెక్రటరీలు ఉదయ్‌కుమార్, శేషగిరికుమార్, పంచాయితీ సిబ్బంది పాల్గొన్నారు.

## బదిలీ పొందిన ఉపాధ్యాయులకు ఘన సత్కారం



**సంబేపల్లి జూన్ 20 ప్రభాతవార్త**
ఉపాధ్యాయులు విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించినప్పుడే వారికి సమాజంలో గుర్తింపు లభిస్తుందని సంబేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుంకర రామకృష్ణ అన్నారు. పాఠశాల నుండి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు శుక్రవారం ఉదయం ఏర్పాటుచేసిన సన్మాన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల వృత్తి ఎంతో పవిత్రమైనదని దానిని సక్రమంగా నిర్వర్తించినప్పుడే విద్యార్థులకు నాణ్యమైన విద్య లభిస్తుందన్నారు. సంబేపల్లి ఉన్నత పాఠశాల అభివృద్ధికి, విద్యాభివృద్ధికి కృషి చేసిన ఉపాధ్యాయుల సేవలు ఎనలేనివన్నారు. వారిని గ్రామ ప్రజలు, విద్యార్థులు ఎల్లప్పటికీ గుర్తుంచుకుంటారన్నారు. అనంతరం పాఠశాల నుండి బదిలీపై వెళ్లిన ప్రధానోపాధ్యాయులు మడితాటి నరసింహారెడ్డి, చంద్రశేఖర్ ఉపాధ్యాయులు సుజాతాబాయి, జోసఫ్, రామయ్య, ఉమాదేవి, నబి సాహెబ్, రాపూరి సుజాతలను దుశ్శాలువులతో, పూలమాలలతో జ్ఞాపికలను ఇచ్చి ఘనంగా సత్కరించారు. పాఠశాలలో నూతనంగా బాధ్యతలు చేపట్టిన 7 మంది ఉపాధ్యాయులను సాదరంగా ఆహ్వానించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ శ్రీనివాసులు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ రెడ్డి రాణి, పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## యోగాంధ్ర విజయవంతం చేయాలి

**ఒంటిమిట్ట జూన్ 20( ప్రభాతవార్త)**
ప్రపంచ యోగా దినోత్సవం పురస్కరించుకొని ప్రజలందరూ మానసికంగా ఆహ్లాదకరంగా ఉండి దేహదారుఢ్యం పెంపొందించుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం యోగా కార్యక్రమం తలపెట్టిన నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నేడు యోగా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు శుక్రవారం ఒంటిమిట్ట ఎంపీడీవో సుజాత స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలందరూ దేహ దారుఢ్యం కలిగి ఉండేందుకు యోగాసనం తలపెట్టినందుకు శుభదాయకమన్నారు. కావున నేటి ఉదయం 7:00 గంటలకు మండల స్థాయి అధికారులు, నాయకులు కార్యకర్తలు, గ్రామస్తులు తప్పనిసరిగా హాజరు కావాలన్నారు.

## రిమ్స్ నందు అన్నదాన సేవ

**కడప జూన్ 20 ప్రభాతవార్త**
అన్నదానం సమదానం, త్రి లోకేషు న విద్యతే " అన్నది పెద్దల మాట, కడప రిమ్స్ నందు ప్రతి మంగళవారం మరియు శ్రుక్రవారం కందుల విద్యాసంస్థల అధినేత శ్రీ డాక్టర్ కందుల చంద్ర ఓబుల్ రెడ్డి వారి తండ్రి జ్ఞాపకార్థం గత సంవత్సరం నవంబర్ నుంచి అన్నదాన సేవ కార్యక్రమం నిర్వహిస్తున్నారు, సుదూర ప్రాంతాల నుంచి వైద్యం కోసం, తమ వారి వైద్య సహాయార్థం మరియు తమకు తెలిసిన వారిని పలకరించడం కోసం వచ్చి తమ దగ్గర ఉన్న డబ్బు సరిపోక ఇబ్బంది పడే వారికి సమయానికి ఆహారం అందించాలనే ఉద్దేశంతో వారి అవస్తని గమనించి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగిందిని తెలిపారు.సుమారు గా 1000 భోజన పొట్లాలు న్రపచుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా తమ విద్యా సంస్థ లో చదువుతున్నా విద్యార్థులు స్వచందంగా ముందుకు వచ్చి భోజన ప్పొట్ల ప్యాకింగ్ మరియు వితరణ సమయానికి రిమ్స్ నందు సహరికస్తున్నారని తెలిపారు.

## విద్యకు పేదరికం అడ్డుకాకూడదు



**ప్రొద్దుటూరు, జూన్ 20, ప్రభాతవార్త**
విద్యకు పేదరికం అడ్డుకాకూడదని 22వ వార్డు కౌన్సిలర్ వై.ఎస్. మొహమ్మద్ గౌస్ తెలిపారు. ప్రతి సంవత్సరం మాదిరిగానే, ఈ సంవత్సరం కూడా రామేశ్వరం పేట ప్రాంతానికి చెందిన పేద విద్యార్థుల శిక్షణాభివృద్ధి కోసం ఆయన శుక్రవారం తన సొంత ఖర్చుతో పాఠ్య పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక మిత్రులు, ఉపాధ్యాయులు పాల్గొని విద్యార్థులను ప్రోత్సహించారు. విద్యపై వై.ఎస్. గౌస్ చూపుతున్న ఈ చొరవ స్థానికంగా ప్రశంసలకు పాత్రమైంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను ప్రతి సంవత్సరం విద్యార్థులకు సహాయం చేసే ఉద్దేశ్యంతో పాఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తున్నానని తెలిపారు.

## రైతు కుటుంబాన్ని ఆదుకోవాలి

**లక్కిరెడ్డిపల్లి జూన్ 20 ప్రభాతవార్త**
అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్న రైతు రామాంజనేయులు కుటుంబాన్ని ప్రభుత్వమే ఆదుకోవాలనీ రైతు చైతన్య ప్రచార సేవా వేదిక రాష్ట్ర కన్వీనర్ చెంచర్ల ఆంజనేయులు డిమాండ్ చేశారు శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ లక్కిరెడ్డిపల్లి మండలం బూడిదగుంటపల్లెకు చెందిన రైతు సుబ్బిగారి రామాంజనేయులు వివిధ రకాల పంటలను సాగు చేసి పంటలు చేతికి రాక పంటకు పెట్టబడులు అప్పులు చేసి సాగుకు పెట్టుబడిగా పెట్టడంతో పంటలు సరిగ్గా పండక పెట్టుబడి కూడా చేతికి రాకపోవడంతో చేసిన అప్పులు తీర్చలేక కుటుంబ పోషణ కష్టమై అప్పులు చెల్లించలేక రైతు రామాంజనేయులు విధి లేని పరిస్థితులో ఆత్మహత్య చేసుకున్నా డు కావున సదరు రామాంజనేయులు కుటుంబం వీధిన పడకుండా వారి కుటుంబానికి ప్రభుత్వం వెంటనే 50 లక్షల రూపాయలు ఆర్థిక సహాయము చేసి ఆదుకోవలసినదిగా వారి కుటుంబం తరపున మేము డిమాండ్ చేస్తున్నాము. ఈ కార్యక్రమం లో జిల్లా కన్వీనర్ గోరి అబ్బాస్ అలీ ఖాన్, చప్పిడి గంగులప్ప తదితరులు పాల్గొన్నారు.

## 20 పోలింగ్ కేంద్రాలు పునర్విభజన



సమావేశంలో మాట్లాడుతున్న పీలేరు నియోజకవర్గ ఈఆర్ఓ

**పీలేరు జూన్ 20 ప్రభాతవార్త :**
పీలేరు నియోజకవర్గం పరిధిలో 20 పోలింగ్ కేంద్రాల్లో పునర్విభజన జంగనుందని పీలేరు ఎన్నికల నమోదు అధికారి బి. అమర్నాథ్ రెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక తహశీల్దారు కార్యాలయంలో నియోజకవర్గ స్థాయిలోని అన్ని మండలాల రెవెన్యూ అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులతో నెలవారి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పీలేరు నియోజకవర్గ ఎన్నికల నమోదు అధికారి మాట్లాడుతూ నియోజకవర్గం పరిధిలో ప్రస్తుతం 281 పోలింగ్ కేంద్రాలున్నాయని, వాటిలో 1200 మంది ఓటర్లు దాటిన 20 పోలింగ్ కేంద్రాలు గుర్తించడం జరిగిందని అన్నారు. వీటిలో గుర్రంకొండ మండలంలో 1, కలకడ మండలంలో 4, కె.వి పల్లి మండలంలో 4, వాల్మీకిపురం మండలంలో 1, పీలేరు మండలంలో 10 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని చెప్పారు. ఈ 20 పోలింగ్ కేంద్రాలను క్షేత్రస్థాయిలో సిబ్బంది తనిఖీలు నిర్వహించి, వారం రోజుల్లోగా నివేదికలను తమకు అందజేయాలని, వాటిని తాము పరిశీలించి ఈ నెలాఖరులోగా జిల్లా కేంద్రానికి పంపాల్సి ఉంటుందని తెలియజేశారు. ప్రస్తుతం నియోజకవర్గం పరిధిలో 1,14,929 మంది పురుషులు, 1,19,772 మంది మహిళలు, 21 మంది థర్డ్ జెండర్ ఓటర్లు మొత్తం 2,34,722 మంది ఓటర్లు ఉన్నారని పేర్కొన్నారు. బిఎల్ఓ లు తమ పరిధిలోని పోలింగ్ కేంద్రాల్లో 18 ఏళ్ల నిండిన యువతీ, యువకులను ఓటర్లుగా నమోదు చేసుకోవాలని, అలాగే మృతి చెందిన ఓటర్లను ఓటర్లను జాబితాలోంచి తొలగించే ప్రక్రియను ఎప్పటికప్పుడు పూర్తి చేసి తప్పులు లేని ఓటర్ల జాబితాను రూపొందించాలని సూచించారు. ఈ సమావేశంలో పీలేరు తహశీల్దారు శివకుమార్, గుర్రంకొండ, కలకడ, వాల్మీకిపురం, కలికిరి, కెవి పల్లి మండలాల రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## రైతుకు తీవ్ర గాయాలు

**మదనపల్లె క్రైమ్, జూన్ 20 ప్రభాతవార్త.**
అడవి పందుల కోసం ఏర్పాటుచేసిన కరెంటు ఉచ్చులో పడి ఓ రైతు తీవ్రంగా గాయపడిన సంఘటన శుక్రవారం ఉదయం వెలుగు చూసింది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పెద్దమండెం మండలం దిగువపల్లికి చెందిన పెద్దిరెడ్డి కొడుకు వి. శ్రీనివాసులు రెడ్డి(58) వ్యవసాయం చేసుకొని కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. తన వ్యవసాయ పొలానికి సమీపంలో గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు అడవి పందుల కోసం కరెంటు ను ఏర్పాటు చేశారు. ఇది తెలియని శ్రీనివాసరెడ్డి శుక్రవారం ఉదయం పొలం వద్దకు వెళుతుండగా ప్రమాదవశాత్తు కరెంటు ఉచ్చులో పడ్డాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అతన్ని మదనపల్లి ఆసుపత్రికి తీసుకొచ్చి చికిత్సలు చేయించారు. అతని పరిస్థితి విషమంగా ఉందని డాక్టర్లు చెప్పడంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతి లోని ఓ ప్రయివేట్ ఆస్పత్రి కి తరలించారు. పెద్దమండెం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## జాబ్ మేళాలో 104 మంది ఎంపిక




**బద్వేలు, జూన్ 20, ప్రభాతవార్త**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ , సీడాప్ మరియు డిస్ట్రిక్ట్ ఎంప్లాయిమెంట్ ఎక్స్చేంజ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఎస్‌బివిఆర్ నందు జాబ్ మేళాను నిర్వహించబడినది. ముఖ్య అతిధిగా ప్రిన్సిపాల్ వెంకట సుబ్బారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు నిరుద్యోగ యువతకు ఇదొక గొప్ప అవకాశం అని, దీనిని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అలాగే ఇలాంటి జాబ్ మేళాలు ప్రతి నెల జిల్లాలోని నియోజక వర్గాలలో జరుగుతుంది అని వివరించారు. ఈ కార్యక్రమానికి 16 సంస్థల అధికారులు హాజరయ్యారని ఆయన వివరించారు. మొత్తం 216 మంది అభ్యర్థులు హాజరు కాగా అందులో 104 మంది ఎంపికయ్యారని తెలిపారు.

## ఎన్డీఏ ప్రభుత్వ అసత్య ఆరోపణలపై ఫిర్యాదు



**తంబళ్లపల్లె జూన్ 20 ప్రభాతవార్త ః**
కేంద్ర, రాష్ట్ర ఎన్డీఏ ప్రభుత్వాలపై అసత్య ఆరోపణలు చేసిన సాక్షి, మరియు వ్యతిరేక సోషల్ మీడియా, మరో 10 మంది పై కేసులు నమోదు చేయాలని టిడిపి మహిళ నాయకురాలు సిద్ధమ్మ, కొటాల శివకుమార్, పార్లమెంట్ తెలుగు యువత ఉపాధ్యక్షుడు మ్యూజికల్ శివ, క్లస్టర్ ఇంచార్జ్ కాల నారాయణ పార్లమెంట్ టిడిపి ప్రధాన కార్యదర్శి గుండ్లపల్లి మధు నాయుడు, మాజీ ఉపసర్పంచ్ మణీ, టిడిపి గ్రామ కమిటీ కార్యదర్శి లోకేష్ రెడ్డి, జనసేన నాయకుడు ఎద్దుల నరసింహులు తంబళ్లపల్లె పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేష్, రాష్ట్ర మంత్రులు, ఎన్ డి ఏ నాయకుల పై చేసిన అసత్య ఆరోపణలు ప్రచురించిన సాక్షి దినపత్రిక యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని స్టేషన్ హౌస్ ఆఫీసర్ నరసింహులు లిఖితపూర్వ ఫిర్యాదు చేశారు.

## ఉద్యోగుల,కార్మికుల పని గంటల పెంపుకు వ్యతిరేకంగా ఏఐటియుసి నిరసన



**రాజంపేట జూన్ 20 ప్రభాతవా ర్త**
తెలుగుదేశం నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఉద్యోగుల, కార్మికుల పని గంటల పెంపును వ్యతిరేకిస్తూ ఏఐటీయూసీ నిరసన వ్యక్తం చేసింది. ఈ మేరకు 10 గంటల పెంపుకు నిరసనగా ధర్నా నిర్వహించారు. శుక్రవారం స్థానిక రాజంపేట సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ఏఐటీయూసీ ఆధ్వర్యంలో జరిగిన ధర్నా లో ఏఐటియుసి పట్టణ కార్యదర్శి సికిందర్ , నాగేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులు, కార్మికులు ఇక నుంచి 10 గంటల పని చేయాలని క్యాబినెట్ తీర్మానం చేసి జీవో జారీ చేయటాన్ని ఆయన తీవ్రంగా వ్యతిరేకించారు. రాష్ట్రస్థాయి కార్మిక సంఘాలతో ఆ అంశాల పట్ల చర్చించకుండా ఏకపక్ష నిర్ణయాలు సరైనది కాదని తప్పుపట్టారు. ప్రపంచవ్యాప్తంగా కార్మికుల పోరాటాల ఫలితంగానే 8 గంటల పని విధానం అమలులోకి వచ్చిందని గుర్తు చేశారు. 8 గంటల పని విధానం అనేది శాస్త్రీయమైన ఆలోచన విధానమని ప్రభుత్వం పునరాలోచించాల్సిన అవసరం ఉందన్నారు. రోజుకి 24 గంటల్లో 8 గంటల పని, 8 గంటల కుటుంబ సేవలు, 8 గంటల నిద్ర అనేది ప్రపంచ వ్యాప్తంగా కార్మికులు పోరాడి సాధించిన విజయమని ప్రభుత్వం గుర్తించాలన్నారు. బడా కార్పొరేట్ సేవల్లో తనమునకులైన రాష్ట్ర ప్రభుత్వం, కార్మికుల శ్రమను వారికి దోచి పెట్టేందుకు, వారికి లాభాలు అర్జించి పెట్టేందుకే 10 గంటల పని విధాన నిర్ణయమని విమర్శించారు. అదనపు గంటలు కూడా పని చేయవచ్చని, మహిళలు కూడా రాత్రులు డ్యూటీలో కూడా చేయవచ్చని నిర్ణయాలు చేయడమంటే కార్మికులను వెట్టి చాకిరి చేయించుకునే విధానానికి నెట్టివేయటమేనన్నారు. మళ్ళీ బానిస వ్యవస్థకు కార్మికులను బానిస బతుకులకు తీసుకుపోతారని ఆయన ప్రభుత్వాన్ని ప్రశ్నించారు .భవణ నిర్మాణ కార్మిక సంఘం బోర్డు పునరుద్ధరిస్తామని చెప్పిన హామీ అమలు చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో, ఆటో డ్రైవర్స్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు రమణ రాజంపేట ఏరియా భవన నిర్మాణ సంగం నరసింహ. పరంగారి సుబ్రమణ్యం . ఆటో డ్రైవర్ వర్కర్ ప్రిపరేషన్ నాయకులు సురేష్ .పెంచలయ్య .సాయి, వెంకటేశు, మల్లికార్జున ,మహేష్ ,మాతయ్య ,తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

**పీలేరు జూన్ 20 ప్రభాతవార్త:**
రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన సంఘటన పీలేరు పట్టణ శివారులో చోటుచేసుకుంది. శుక్రవారం రాత్రి స్థానిక చిత్తూరు కడప జాతీయ రహదారిలోని మోడల్ కాలనీ సమీపంలో చోటు చేసుకున్న ఘటనలో మృతుడి వద్ద లభించిన ఆధార్ కార్డ్ ఆధారంగా పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. అన్నమయ్య జిల్లా, కలికిరి మండలం, టి. వడ్డిపల్లికి చెందిన వేముల వెంకటరమణ కుమారుడు వేముల శ్రీనాథ్ ద్విచక్ర వాహనాన్ని ఈచర్ లారీ ఢీకొనడంతో యువకుడి తలకు బలమైన గాయమై రోడ్డుపై అపస్మారక స్థితిలో పడ్డాడు. స్థానికులు 108 వాహనానికి సమాచారం అందించి పట్టణంలోని ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. బాధితుడిని పరిశీలించిన వైద్యులు అతను అప్పటికే మృతి చెందాడని ధ్రువీకరించారు. మృతదేహాన్ని శివ పరీక్ష నిమిత్తం మార్చురీకి తరలించారు.

## యోగ వారోత్సవాల్లో భాగంగా స్కూల్ విద్యార్థులు ర్యాలీ

**మైదుకూరు, జూన్ 20, ప్రభాతవార్త:**
మైదుకూరులో యోగా వారోత్సవాలలో భాగంగా స్కౌట్ విద్యార్థులుర్యాలీగా జిల్లా పరిషత్ పాఠశాల నుండి బయలుదేరి యోగా గురించి స్లొగన్స్ చెపుతూ శ్రీకృష్ణ దేవరాయ సర్కిల్ లో మానవ హారం నిర్వహించారు.ఈ సందర్భంగా పాఠశాల హెడ్ మాస్టర్ ఎస్.ఇలియాస్ అహమ్మద్ మాట్లాడుతూ యోగా చేయడం ద్వారా శారీరక ,మానసిక ఆరోగ్యం కలుగుతుంది అన్నారు. ఎస్ టి యు జిల్లా ఆర్థిక కార్యదర్శి గోశెట్టి రామమోహన్ మాట్లాడుతూ యోగా అవశ్యకతను,యోగావల్ల కలిగే ఉపయోగాల గురించి తెలియజేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఎన్ సి సి అధికారి సురేంద్ర నాయక్, పిడి రామ్ నాయక్,ఉపాధ్యాయులు ఏ.శ్రీనివాసులు, కె.ఆనంద రావు,టి.ఓబులరెడ్డి ,రాముడు తదితరులు పాల్గొన్నారు.





**ఇంటి పేరు & పేరు మార్పు**

గొల్ల రామాంజనేయులు S/O గొల్ల వెంకటరమణ (పాత పేరు) D No 3/48, వీరబల్లి రోడ్డు, మాసాపేట, రాయచోటి, అన్నమయ్య జిల్లా, 516270, ఆంధ్రప్రదేశ్ కొత్త ఇంటి పేరు పేరు గల్లా రామాంజనేయులు S/o గల్లా వెంకటరమ ణసెల్ No 8425050341

## మంచి న్యాయవాదిగా గుర్తింపు పొందాలి

### రాజంపేట పార్లమెంట్ అధ్యక్షుడు. చమర్తి

ఒంటిమిట్ట జూన్ 20( ప్రభాతవార్త)

2024, 25 సంవత్సరానికి గాను రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన ఎల్.ఎల్. ఎం. లా సెట్ పరీక్ష ఫలితాలు గురువారం విడుదల కావడం జరిగింది .ఈనేపథ్యంలో ఒంటిమిట్ట మండలం ఒంటిమిట్ట గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ అసెంబ్లీ లీగల్ సెల్ ప్రధాన కార్యదర్శి అడ్వకేట్ సుధామణి కుమార్తె యనమల.లోకేశ్వరి రాష్ట్రంలో రెండవ ర్యాంక్ సంపాదించింది.ఈ సందర్భంగా రాజంపేట నియోజకవర్గ పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి. జగన్మోహన్ రాజు విద్యార్థినికి చరవాణి ద్వారా శుభాకాంక్షలు తెలియజేసి మంచి న్యాయవాదిగా గుర్తింపు తెచ్చుకుని న్యాయవాదంలో ప్రజలకు సేవ చేస్తూ న్యాయం ప్రక్క నిలబడి ఉన్నత పదవులు అలంకరించాలని ఈసందర్భంగా ఆశీర్వదించడం జరిగింది.

## కార్పొరేట్ ప్రైవేట్ పాఠశాలల కట్టడి చేయడంలో విఫలమైన విద్యాశాఖధికారులు

### పిడియస్ యు రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.అంకన్న




రాయచోటి జూన్20 ప్రభాత వార్త

అన్నమయ్య జిల్లాలో రాయచోటి, మదనపల్లి, పీలేరు, రైల్వేకోడూరు రాజంపేట, ప్రాంతాల్లో ఉన్న కార్పొరేట్ ప్రవేట్ పాఠశాలలు విద్యార్థులకు కనీస సౌకర్యాలు మైదానం కల్పించకుండా లక్షలాది రూపాయలు విద్యార్థుల వారి తల్లిదండ్రుల నుండి పాఠశాల విద్య హక్కు చట్టం నిబంధనలకు విరుద్ధంగా అర్హత పరీక్ష పేరుతో నిర్వహిస్తూ పాఠ్యపుస్తకాలు పేరుతో దోపిడీకి గురిచేస్తూ మోసం చేస్తున్నారని పిడిఎస్ యు రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.అంకన్న మండిపడ్డారు. శుక్రవారం రాయచోటి పట్టణంలో మాసాపేట ప్రాంతంలో పిడియస్ యు ఆధ్వర్యంలో నిరసన నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సిబిఎస్ఈ, ప్రైమరీ పాఠశాలలు మరియు నవోదయ సైనిక పాఠశాలలు అనుమతి లేకపోయినా, గుర్తింపు లేకుండా పలు పాఠశాలలు కొనసాగుతున్నాయని, సొంతంగా ప్రవేట్ వసతి గృహాలు ఏర్పాటు చేసుకొని విద్యార్థులకు కనీస సౌకర్యాలు కల్పించకుండా నిర్లక్ష్యం చేస్తూ రూపాయలు వసూలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పరిరక్షించాల్సిన పాఠశాల విద్యాశాఖ ఆర్జేడి, డీఈఓ,డిప్యూటీ డిఈఓలు పూర్తిగా విఫలమయ్యారని వారు ఆరోపించారు. ఇప్పటికైనా ఇండియన్ సేక అధికారులు స్పందించి ఆకస్మిక తనిఖీలు నిర్వహించి ప్రభుత్వ పాఠశాలలను కాపాడాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో పిడిఎస్ యు అన్నమయ్య జిల్లా నాయకులు రవీంద్ర,మహేష్, కార్తీక్, మనోహర్ రెడ్డి, శ్రీనివాసులు,ఖాజా, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## రెండవ విడత దరఖాస్తులకు ఆహ్వానం

తొండూరు జూన్ 20, ప్రభాతవార్త:

స్థానిక తొండూరు మండలంలోని ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ ఐటిఐ నందు 2025, 26 సంవత్సరంనకు మొదటి విడత నందు భర్తీ కాగా మిగిలిన ఖాళీలను భర్తీ చేయుటకు రెండవ విడతగా దరఖాస్తులు ఆన్లైన్ ద్వారా కోరడమైనది ఆన్లైన్ ద్వారా రిజిస్టర్ చేసుకోవడానికి చివరి తేదీ 15. 7. 2025 వరకు పొడిగించడం అయినది కావున పదవ తరగతి పాసైన విద్యార్థులు iti.ap.gov.in నందు విద్యార్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లు, ఫోటో, ఆధార్ ధ్రువీకరణ పత్రాలను తీసుకొని ఐటిఐ తొండూరు నందు తమ వివరాలను ఉచితంగా నమోదు చేసుకుని జులై 21వ తేదీన కౌన్సెలింగ్ హాజరు కావాలని కళాశాల ప్రిన్సిపల్ వై వెంకట్ రెడ్డి తెలిపారు ఆసక్తి కనపరిచిన విద్యార్థులు ఇతర వివరాలకు ప్రభుత్వ ఐటిఐ తొండూరు నందు సంప్రదించవలెనని ఒక ప్రకటన ద్వారా తెలియజేశారు.

## మండల పార్టీ అధ్యక్షుని సహోదరుని పార్థివ దేహానికి చమర్తి నివాళి



ఒంటిమిట్ట జూన్ 20( ప్రభాతవార్త)

మండలం పెన్నపేరూరు గ్రామానికి చెందిన మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు గజ్జెల.నరసింహారెడ్డి సహోదరుడు గజ్జెల. ఓబులరెడ్డి గురువారం రాత్రి మృతి చెందడం జరిగింది.జరిగిన విషయం స్థానిక పార్టీ నాయకుల ద్వారా రాజంపేట నియజకవర్గ పార్లమెంట్ అధ్యక్ష చమర్తి .జగన్మోహన్ రాజు తెలుసుకున్న అనంతరం శుక్రవారం పెన్న పేరూరు గ్రామానికి వెళ్లి గజ్జల. ఓబుల్ రెడ్డి పార్థివ దేహానికి పూలమాలవేసి శ్రద్ధాంజలి ఘటించారు. వారి కుటుంబీకులకు మనోధైర్యం కలిగించాలని భగవంతుని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు గజ్జల. నరసింహారెడ్డి, మండల పార్టీ నాయకులు కాంట్రాక్టర్ ఎస్. వెంకటరమణ, కొత్తపల్లి .బొబ్బిలి రాయుడు, రోశయ్య గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

## కార్యకర్తలను, ప్రజలను రెచ్చగొట్టడం తగదు

సిద్ధవటం జూన్ 20 ప్రభాతవార్త



మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కార్యకర్తలను ప్రజలను రెచ్చగొట్టడం తగదని రాజంపేట టిడిపి ఉపాధ్యక్షుడు పుత్త రామచంద్రయ్య హితవుపలికారు మా అధినేత రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబు నాయుడు పార్టీ కార్యకర్తలను కానీ ప్రజలను కానీ రెచ్చగొట్టే వాక్యాలు ఎప్పుడు చెయ్యరు. పార్టీ కార్యకర్తలు కొన్ని సందర్భాలలో కోపంలో ఏదైనా రెచ్చగొట్టే మాటలు మాట్లాడితే, తమ్ముళ్లు నోరు జాగ్రత్త,ప్రజల్లో ఉన్నాం అని ఇష్టం వచ్చినట్లు ఏది పడితే అది మాట్లాడితే ఉపేక్షించను అంటూ సొంత కార్యకర్తలను కూడా చాలా కఠినంగా వారించే గుణం చంద్రబాబు కలదు,ఇకనైనా జగన్మోహన్ రెడ్డి కొందరు వైకాపా నాయకులు ప్రజలను మరియు వైకాపా కార్యకర్తలను రెచ్చగొట్టే వాక్యాలు మానుకుని, హుందాగా రాజకీయాలు చెయ్యాలని,అలాగే ప్రభుత్వము చేస్తున్న కార్యక్రమాలు నచ్చితే మద్దతివండి,లేదా అందులో ఏవైనా లోపాలు ఉంటె బాధ్యతగా ప్రశ్నించండి అంతే తప్ప ఇష్టం వచ్చినట్లు ఏది పడితే అది ప్రజాస్వామ్యంలో మాట్లాడితే ఎన్నికల సమయంలో ప్రజలే సరైన నిర్ణయం తీసుకుంటారు అని ఆయన పేర్కొన్నారు.

## యోగాడేను విజయవంతం చేయండి

### మున్సిపల్ కమీషనర్ ప్రమీళ

మదనపల్లె, జూన్ 20 ప్రభాతవార్త :



నేడు ప్రభుత్వం నిర్వహించే 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయాలని మున్సిపల్ కమీషనర్ ప్రమీళ తెలిపారు. శుక్రవారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ ప్రభుత్వం మే 21, 20025నుంచి జూన్ 21వరకు యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మదనపల్లె పురపాలక సంఘం పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు శనివారం ఉదయం 6గంటల నుంచి 8గంటల వరకు యోగాడేను నిర్వహించడం జరుగుతుందన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో మున్సిపాలిటి పరిధిలోని అన్నిశాఖల అధికారులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

# ఎమ్మెల్యే వరద పై అవినీతి ఆరోపణలు గుప్పించిన రాచమల్లు

ప్రొద్దుటూరు జూన్ 20 ప్రభాతవార్త



ప్రొద్దుటూరు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డిపై మాజీ ఎమ్మెల్యే వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాద్ రెడ్డి వరుస అవినీతి ఆరోపణలు గుప్పించారు. శుక్రవారం తన నివాసంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత మీడియా సమావేశంలో ఎమ్మెల్యే నంద్యాల వరదరాజురెడ్డి తనపై చేసిన ఆరోపణలకు సమాధానం చెప్పినట్లుగానే ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి పై తాను చేసే అవినీతి ఆరోపణలపై కూడా దాటవేసే ధోరణి కాకుండా సూటిగా సమాధానం చెప్పాలని కోరారు. ఎమ్మెల్యే వరద తీసిన ఆరోపణలు పై తాను ఇచ్చే సమాధానాలపై సంతృప్తి చెందకపోతే విచారణ జరిపి తనపై చర్యలు తీసుకున్న ఎలాంటి అభ్యంతరం లేదన్నారు. ప్రముఖ రియల్ ఎస్టేట్ వ్యాపారి నిమ్మకాయల సుధాకర్‌రెడ్డి భూములను అధికారులతో చెరువు భూములుగా చూపించి తిరిగి అనుమతులు ఇచ్చేందుకు ఆరు కోట్ల రూపాయలు నీ కుమారుడు కొండారెడ్డి మూడో కంటికి తెలియకుండా దండుకున్నారా లేదా సమాధానం చెప్పాలన్నారు. ఆరు నెలలుగా అనుమతులు ఇవ్వకుండా హైకోర్టు ఇచ్చిన ఆరు గంటలకే చెరువు భూమి కాదని అధికారులు అనుమతులు ఇవ్వడంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు కేవలం ఎమ్మెల్యే వరద డబ్బులు దండుకున్న అనంతరం నిమ్మకాయల సుధాకర్ రెడ్డికి అనుమతులు ఇచ్చారని ఆరోపించారు. ఈ నేపథ్యంలో నిమ్మకాయల సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ ఉంటే పిండికి ఎలుకకు సాక్ష్యం చెప్పినట్లుగా ఉందని ఎద్దేవా చేశారు. డిప డబ్ల్యు కళాశాల ఆస్తుల వ్యవహారంలో యాజమాన్యానికి ప్రభుత్వం చేత పని పూర్తి చేసి రెండు ఎకరాలు తీసుకున్నది నిజమా కాదా సమాధానం చెప్పాలన్నారు విజయవాడ బ్రాహ్మణుని హత్యోదంతంలో వచ్చిన ఆస్తులలో వాటాలు తీసుకున్నారని ఆరోపించారు. ఇది నీతి నిజాయితీ అంటారా అని ప్రశ్నించారు. వ్యాపార లావాదేవీల ఆర్థిక వ్యవహారాలతో మిట్టా శివ గణేష్ పై దాడి చేయడం సమంజసమా అని ప్రశ్నించారు. ప్రముఖ అడ్వకేట్ ఈవి సుధాకర్ రెడ్డి అప్పులు చెల్లించమని అడిగితే నిర్దాక్షిణ్యంగా దాడి చేసిన మాట వాస్తవమా కాదా అది ప్రశ్నించారు. ఎమ్మెల్యే వరద మనవడు హైదరాబాదులో అపర్ణ కన్స్ట్రక్షన్స్ లో వాటా ఉందని పలు రకాల వ్యక్తులతో 40 కోట్ల రూపాయలు దండుకున్నది నిజం కాదా అని ప్రశ్నించారు. సుందరాచార్యుల క్లబ్బు సభ్యుల డబ్బు కోటి రూపాయలు ఏమైందని ప్రశ్నించారు. నియోజకవర్గ పరిధిలో జరిగే అభివృద్ధి పనులకు ఇతర కాంట్రాక్టర్లు వేలంలో పాల్గొనకుండా బెదిరింపులకు దిగారని ఆయన అభియోగం మోపారు. కొర్రపాడు రోడ్డులోని ఎస్ ఎస్ మాల్ నిర్మాణం నేపథ్యంలో మున్సిపాలిటీ ఇవ్వాల్సిన ఐదు కోట్ల 70 లక్షలు ఎందుకు చెల్లించలేదని ప్రశ్నించారు. అలాగే బొల్లవరం ఎస్సీ భూములు రెండు కోట్లు దండుకునే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. అవసరం లేకపోయినా తాను అప్పులు తీసుకుని తిరిగి చెల్లించకపోవడం తన నైజం అని చేసిన వరద విమర్శలకు ఆయన ఘాటుగా స్పందించారు. ప్రొద్దుటూరు పట్టణంలో ఎమ్మెల్యే నంద్యాల వరదరాజు రెడ్డికి వారి కుటుంబ సభ్యులకు ఉన్న అప్పులు ఎవరికి లేవని విమర్శించారు. ఈ అప్పులు 18 ఏళ్లుగా చెల్లించకుండా అప్పుదారుల ఇబ్బందులు తెలుసుకోకుండా వారిని మనోవేదనకు గురి చేసింది మీరు కాదా అని ప్రశ్నించారు. ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి వారి కుటుంబ సభ్యులకు ఉన్న అప్పుల వివరాలను పేర్లతో సహా ఆయన వివరించారు. తాను చెప్పిన పేర్ల వారికి అప్పులు ఉన్నారా లేదా సమాధానం చెప్పాల్సిన అవసరం ఎమ్మెల్యే వరదరాజులు రెడ్డికి ఉందన్నారు. తాను చేసిన ఈ ఆరోపణలపై సూటిగా సమాధానం చెప్పాలని ఒకవేళ సమాధానం చెప్పకపోతే ఆరోపణలను అంగీకరించినట్టే అని భావిస్తానని తెలిపారు. ఈ సమావేశంలో కౌన్సిలర్లు వైసిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## భాకరాపేటలో ద్విచక్ర వాహనాలు తనిఖీ

సిద్ధవటం జూన్ 20 ప్రభాతవార్త



మండలంలోని కడప చెన్నై జాతీయ రహదారి భాకరాపేటఫారెస్ట్ చెక్ పోస్ట్ సమీపాన శుక్రవారం సాయంత్రం సర్కిల్ ఇన్స్పెక్టర్ బాబు విస్తృత వాహనాలు తనిఖీ చేపట్టారు ఈ సందర్భంగా సర్కిల్ ఇన్స్పెక్టర్ బాబు మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు ప్రతి ఒక్కరూ హెల్మెట్ తప్పనిసరిగా వాడాలని ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించకపోవడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని మీ ప్రాణాలు కాపాడుకొనుటకు కచ్చితంగా హెల్మెట్ ధరించాలని ఎవరైనా ద్విచక్ర వాహనదారుడు హెల్మెట్ లేకుండా వాహనం నడిపిన ఎడల వారిపై చట్ట ప్రకారం చర్యలు తప్పవని కావున ప్రతి ఒక్క ద్విచక్ర వాహనదారుడు హెల్మెట్ ధరించాలని తెలిపారు ఈ కార్యక్రమంలో పోలీసులు పాల్గొన్నారు.

## రెవిన్యూ కార్యాలయంలో రెవిన్యూ దినోత్సవం




రామసముద్రం జూన్ 20 ప్రభాతవార్త

మండల కార్యాలయంలో శుక్రవారం రెవిన్యూ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. సందర్భంగా తాహశీల్దార్ మహ్మద్ అజారుద్దీన్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో రెవిన్యూ శాఖ అత్యంత కీలక మైనదని, అన్ని శాఖలకు తల్లి వంటిదన్నారు. ప్రతి రెవిన్యూ ఉద్యోగి రోజు రోజుకూ విజ్ఞానాన్ని పెంపొందించుకొని విధులు నిర్వహిస్తే అద్భుతమైన ఫలితాలు ఉంటాయని అన్నారు. సమాజంలో ఏ సంక్షోభం ఎదురైనా మొదట రెవిన్యూ శాఖ స్పందించి సమస్యను పరిష్కరించేందుకు సిద్ధంగా ఉంటుందన్నారు.మండలానికి నూతన తాహశీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన మహ్మద్ అజారుద్దీన్ ను, రెవెన్యూ శాఖకు సేవలు అందించిన విశ్రాంత ఆర్ఐ జివి.రమణను ఎమ్మార్వో కార్యాలయ సిబ్బంది పూలమాలలు వేసి శాలువ కప్పి ఘనంగా సన్మానం చేశారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్నా ఆర్ ఐ వసీం, ,మండలం సర్వేయర్ నరేంద్ర, సీనియర్ అసిస్టెంట్ రెడ్డెప్ప, విఆర్ఓలు రెహ్మాన్, జగదీష్, రఘురామ్, అనూష, మమత, భారతి, గౌరీ, అనూష, సునీత సిబ్బంది పాల్గొన్నారు.

## యోగపై ప్రజలకు అవగాహన



రామసముద్రం జూన్ 20 ప్రభాతవార్త

ఏపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా జరుపుతున్నటువంటి యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా పెద్దకురప్పల్లె గ్రామ పంచాయతీ తిరుమలరెడ్డిపల్లె గ్రామంలోని శుక్రవారం ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో సీహెచ్ఓ ఉమాదేవి ఆధ్వర్యంలో ప్రజలతో యోగాకు సంబందించిన కొన్ని ఆసనాలను సాధన చేశారు. సిహెచ్ఓ ఉమా దేవి మాట్లాడుతూ యోగాతో అనేక రకమైన జబ్బులు నయమవుతాయన్నారు. ప్రతిరోజు ఉదయం సాయంత్రం యోగ సాధన చేయడం వలన, మానసిక ప్రశాంతత, ఆయుస్సు ప్రమాణాన్ని, ఆరోగ్య పరంగాఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉమాదేవి, ఏఎన్ఎం గీతారాణి ఆశావర్కర్స్ లక్ష్మి, భానుప్రియ, గాయిత్రి ప్రజలు పాల్గొన్నారు.

## కళ్ళకు గంతలు కట్టుకొని నిరసనలు

### 17వ రోజు కొనసాగిన ఇంజనీరింగ్ కార్మికుల సమ్మె

మదనపల్లె, జూన్ 20 ప్రభాతవార్త :

కళ్ళకు గంతలు కట్టుకొని మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు వినూత్న తరహాలో నిరసన వ్యక్తం చేశారు. శుక్రవారం సమ్మె కార్యక్రమంలో భాగంగా 17వ రోజు కొనసాగింది. వీరి సమ్మె కార్యక్రమంలో జేఏసి నాయకులు ఎంఎస్. కన్నయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని మున్సిపాలిటిల్లోనూ 45రోజులుగా శాంతియుత సమ్మె నిరసన చేస్తున్నా ప్రభుత్వం ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తోందన్నారు. ప్రభుత్వం ఇంజనీరింగ్ కార్మికులకు అన్యాయం చేస్తున్నదన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వకుండా, ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ పథకాలు కూడా రాకుండా అన్యాయం చేస్తోందన్నారు. వీరి న్యాయమైన డిమాండ్లు వెంటనే తీర్చకపోతే ఈనెల 22న మెరుపుసమ్మెలో మా యూనియన్ కూడా పాల్గొని సమ్మెను ఉదృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి చిత్తూరుజిల్లా ఇంజనీరింగ్ కార్మికులు జేఏసి అధ్యక్షులు ఎస్‌కె.రెడ్డప్ప, జేఏసి నాయకులు ఎంఎస్ఎస్.కన్నయ్య, నాగరాజు, గోపాల్‌క్రిష్ణ, సజార్‌కుమార్, మహేష్, ఇంజనీరింగ్ కార్మికులు పాల్గొన్నారు.



కళ్ళకు గంతలు కట్టుకొని నిరసన తెలుపుతున్న దృశ్యం

## జిల్లా అభివృద్ధి కోసం నిధులు కేటాయించాలి




నిరసనలు తెలుపుతున్న దృశ్యం

మదనపల్లె, జూన్ 20 ప్రభాతవార్త :

జిల్లా సమగ్రాభివృద్ధి కోసం ప్రత్యేక నిధులు కేటాయించాలని, హంద్రీ-నీవా పనులు వెంటనే పూర్తి చేయాలని సిపిఐ ఆధ్వర్యంలో శుక్రవారం సబ్‌కలెక్టరేట్ కార్యాలయం వద్ద సంతకాల సేకరణకార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యవర్గసభ్యులు క్రిష్ణప్ప, సాంబశివ, నియోజకవర్గ కార్యదర్శి మురళీలు మాట్లాడుతూ జిల్లాలో ప్రాజెక్టులు మరమ్మత్తులకు గురై ఐదేళ్ళు అవుతున్నా ఇంతవరకు పనులు చేపట్టలేదన్నారు. హంద్రీనీవా పనులు నాలుగు దశాబ్దాలు గడిచినా పూర్తి కాలేదన్నారు. మదనపల్లె ప్రజల దాహార్తి తీర్చడానికి నిర్మించిన చిప్పిలి సమ్మర్‌స్టోరేజ్ పనుల కూడా పూర్తి కాలేదన్నారు. కడప నుంచి రాయచోటి మదనపల్లె మీదుగా బెంగుళూరుకు రైల్వేలైన్ నిర్మిస్తామని, మదనపల్లెను జిల్లా కేంద్రం చేస్తామని, బిటి కళాశాలను యూనివర్శిటిగా ప్రకటిస్తామని, టమోటా ఆధారిత పరిశ్రమలు ఏర్పాటు చేస్తామని ఎన్నికల్లో కూటమి నాయకులు వాగ్దానం చేశారన్నారు. మదనపల్లె-నిమ్మనపల్లె, మదనపల్లె-రామసముద్రంలకు డబుల్‌రోడ్డు నిర్మించాలన్నారు. సిపిఐ ఆధ్వర్యంలో ఈనెల 23న సబ్‌కలెక్టర్ కార్యాలయం ముందు పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు దేవా, తిరుమల, ముభారక్, చలపతినాయుడు, జానకమ్మ, ఇంద్రాణి తదితరులు పాల్గొన్నారు.

## జగన్ వ్యవహారశైలి ప్రజాస్వామ్యానికి ప్రమాదం

### టిడిపి పార్లమెంటరీ నేత ఆర్‌జె.వెంకటేష్



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌జె.వెంకటేష్

మదనపల్లె, జూన్ 20 ప్రభాతవార్త :

మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి వ్యవహారశైలి ప్రజాస్వామ్యానికి ప్రమాదమని రాజంపేట పార్లమెంటు టిడిపి అధికార ప్రతినిధి ఆర్‌జె. వెంకటేష్ తెలిపారు. శుక్రవారం నిమ్మనపల్లె సర్కిల్ నందు పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్య రాజకీయాల్లో హింసకు స్థానం లేదన్నారు. వైసిపి అధికారంలో ఉన్నప్పుడు కమ్మ సామాజికవర్గాన్ని వేధించి, ఇతర వర్గాలను దూరంచేసి ప్రస్తుతం ప్రేమ ఒలగబోసిన ప్రస్తుతం ఎవరూ నమ్మె స్థితిలో లేరన్నారు. రాష్ట్రంలో కక్ష రాజకీయాలను ప్రభుత్వం ఉపేక్షించదు అన్నారు. వైసిపి అధికారంలోకి వస్తే గంగమ్మకు బలి ఇచ్చే విధంగా రప్పా, రప్పా నరుకుతామన్నట్లు ప్రదర్శించిన ప్లెక్సీ విషయాన్ని జగన్ సమర్థించేలాగా మాట్లాడడం ఫ్యాక్షన్ రాజకీయాలకు నిదర్శనమన్నారు. రాజారెడ్డి ఆలోచనలతో రాజకీయాలు చేస్తే ప్రజలు సమర్థించరని హితవు పలికారు. గంజాయి, సారాయి బ్యాచ్‌లతో రాజకీయాలు చేస్తే విలువలు, విశ్వసనీయత ఉండదన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నరసింహారెడ్డి, మనోహర్‌రెడ్డి, రామాంజులు, రామచంద్రనాయుడులు పాల్గొన్నారు.

## కార్మికుల పనిగంటలు పెంచుతూ నిర్ణయం దారుణం

### ఏఐటియుసి నాయకులు ధర్నా




ధర్నా నిర్వహిస్తున్న దృశ్యం

మదనపల్లె, జూన్ 20 ప్రభాతవార్త :

రాష్ట్రంలో కార్మికుల పనిగంటలు 8గంటల నుండి 10గంటలకు పెంచడం దారుణమని నిరసిస్తూ ఏఐటియుసి నాయకులు శుక్రవారం సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1886లో మేడే పోరాటాల ఫలితంగా ఎనిమిది గంటల పని దినాలు అమలులోకి వచ్చాయన్నారు. అలాంటిది ఇప్పుడు 8గంటల పనిని 10 గంటలకు పెంచడం దారుణమన్నారు. మహిళాకార్మికులు రాత్రిపూట డ్యూటీలను మినహాయింపు ఉండేదని ఇప్పుడు పనిగంటలు పెంచడంతో భద్రత కరువు అవుతుందన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు మున్సిపల్ కార్మికుల పిల్లలకు వర్తింప చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ముభాకర్, తిరుమల, దేవా, ఇంద్రాణి, రాధా, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా రెవెన్యూ దినోత్సవం

మదనపల్లె, జూన్ 20 ప్రభాతవార్త :



మదనపల్లె తహశీల్దార్ కార్యాలయంలో శుక్రవారం ఘనంగా రెవెన్యూ దినోత్సవాన్ని జరుపుకొన్నారు. తహశీల్దార్ కార్యాలయం ఆవరణంలో రెవెన్యూ దినోత్సవం సందర్భంగా పదవీవిరమణ పొందిన రెవెన్యూ అధికారులను సన్మానించారు. సమాజంలో రెవెన్యూ సేవలు చాలా ప్రధానమైనవి అని తహశీల్దార్ కిషోర్‌కుమార్‌రెడ్డి తెలిపారు. రైతులకు సంబంధించిన భూ సమస్యల పరిష్కారం, పట్టాదారు పాస్‌పుస్తకాలు, వన్‌బీ, అడంగల్ ఆన్‌లైన్ వంటి సేవలు చాలా ముఖ్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఓ నిర్మలాదేవి, డిప్యూటి తహశీల్దార్ ఫిరోజ్‌శాన్, ఆర్ఐ బాలసుబ్రమణ్యం, విఆర్ఓలు పాల్గొన్నారు.

## మిగిలిన సీట్లకు ప్రవేశ పరీక్ష

పెనగలూరు జూన్ 20 ప్రభాతవార్త

మండలంలో ఉన్నటువంటి ఏపీ మోడల్ స్కూల్ నందు 7.8 తరగతులకు మిగిలిన సీట్లను భర్తీ చేయుటకు ఆన్లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకున్న విద్యార్థులకు ప్రవేశ పరీక్ష 24 వ తేదీన ఉదయం 10 గంటలకు స్థానిక పెనగలూరులో ఉన్నటువంటి ఏపీ మోడల్ స్కూల్ నందు ప్రవేశ పరీక్ష నిర్వహించబడును అని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ తెలిపారు.

## మల్లెల ఘాట్లో ఆర్టీసీ బస్సుకి తప్పిన ప్రమాదం

తొండూరు జూన్ 20 ప్రభాతవార్త:



మండలంలోని మల్లెల ఘాట్ రోడ్లో సింహాద్రిపురం నుండి ప్రొద్దుటూరుకు వెళుతున్న బస్సు ఉదయం 7 గంటల సమయంలో ప్రొద్దుటూరు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు మలుపులో స్టీరింగ్ తిరగక ప్రక్కన ఉన్న లోయలోకి జారీ పెద్ద బండరాయిని ఢీ కొట్టి ఆగిపోయింది ఈ ప్రమాదంలో బస్సులో ప్రయాణిస్తున్న 30 మంది ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు కొంతమందికి స్వల్పంగా గాయాలు అయ్యాయి. ఎటువంటి ప్రాణాష్టం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు ఈలోపు పోలీసులకు విషయం తెలిసిన వెంటనే ఘటనా స్థలానికి చేరుకొని సహాయ చర్యలు చేపట్టారు. డ్రైవర్ చాకచక్యంతో పెను ప్రమాదం తప్పింది.

## సోలార్ విద్యుత్‌తో కరెంటు కష్టాలు తీరుతాయి




తంబళ్లపల్లె జూన్ 20 ప్రభాతవార్త ః

మండలంలోని విద్యుత్ వినియోగదారులు సోలార్ విద్యుత్ వినియోగంతో భవిష్యత్తులో కరెంటు కష్టాలు తీరుతాయని విద్యుత్ శాఖ డి ఈ ఈ గోవింద్ రెడ్డి సూచించారు. శుక్రవారం విద్యుత్ వినియోగదారుల సమీక్షలో ఆయన మాట్లాడుతూ సోలార్ విద్యుత్తు వినియోగం తో గుజరాత్ రాష్ట్రం లో కరెంటు కష్టాలు తప్పడంతోపాటు అదనపు విద్యుత్తుతో ఆర్థిక లబ్ధి పొందినట్లు చెప్పారు. ఇదే స్ఫూర్తితో ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్ర విద్యుత్ వినియోగదారుల కోసం సూర్యఘర్ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారని ప్రతి వినియోగదారుడు తమ ఇంటిపై సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేసుకొని విద్యుత్ ఆదాతో పాటు ఆదనపు ఆదాయం పొందాలని సూచించారు. సోలార్ విద్యుత్తు వాడకంలో తొలుత విద్యుత్ శాఖ ఉద్యోగులు, ప్రభుత్వ ఉద్యోగులు స్ఫూర్తిగా నిలవాలన్నారు. సోలార్ విద్యుత్తు వలన ప్రతి ఇంటికి నిరంతర విద్యుత్తు తో పాటు సదరు కంపెనీ రెండు మాసాలకు ఒకసారి అదనపు విద్యుత్తుకు డబ్బు చెల్లింపు తో పాటు ఐదేళ్ల వరకు ఉచిత రిపేర్లు భరిస్తుందన్నారు. భవిష్యత్తులో నీరు, బొగ్గు తో ఉత్పత్తి అయ్యే విద్యుత్తు ఖర్చు ఎక్కువ అవుతుందని ప్రకృతి వనరుల లో భాగంగా సోలార్ విద్యుత్తు వినియోగంపై దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఈ సురేంద్ర, ఏవో థామస్ రాజా, ఎంఈఓ త్యాగరాజు, సబ్ ఇంజనీర్ శేషుబాబు, ఎల్ఐ లు భాస్కర్, నాగరాజు, లైన్మెన్లు అప్పి రెడ్డి, శంకర, సిబ్బంది అమీన్, ఇంతియాజ్, శ్రీకాంత్, నాగేంద్ర, భాస్కర్ సబ్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## సోలార్ రూఫ్ టాప్ అవగాహన సదస్సు

పెనగలూరు జూన్ 20 ప్రభాతవార్త

మండల కేంద్రంలో ఉన్నటువంటి పెనగలూర్ పెనగలూరు ఎంపీడీవో ఆఫీస్ నందు సోలార్ రూఫ్ టాప్ గురించి సదస్సు నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ అధికారులు పాల్గొన్నారు ఈ కార్యక్రమానికి రాజంపేట డివిజన్ డిఈ గారు మాట్లాడుతూ కోటి రూఫ్ టాప్ లు లక్ష్యంగా ప్రజల్లో చైతన్యం కలిగించి సోలార్ ప్రాముఖ్యత గురించి వివరించాలన్నారు ఈ కార్యక్రమానికి విద్యుత్ అధికారులు పెనగలూరు జె ఈ, చిట్వేల్ డి ఈ మరియు విద్యుత్ ఉద్యోగస్తులు పాల్గొన్నారు.

## చియ్యపాడు పాఠశాలను దత్తత తీసుకున్న డీఈవో



చాపాడు. జూన్ 20. ప్రభాతవార్త :

మండలంలోని చియపాడు దళితవాడ పాఠశాలను దత్తతకు తీసుకుంటున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి శంషుద్దీన్ తెలిపారు. శుక్రవారం పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా దళితవాడకు చెందిన3,4,5, తరగతులు చదివే విద్యార్థులను బీసీ కాలనీ లోని మోడల్ ప్రైమరీ స్కూల్ లోకి విలీనం చేయాలనే అధికారుల ప్రయత్నాలను తల్లిదండ్రులు ఏమాత్రం ఒప్పుకోలేదు. ఈ విషయమై గత నాలుగు రోజుల నుండి విద్యార్థులు తల్లిదండ్రులు పాఠశాల ఎదుట నిరసనలు, ఆందోళనలతో పాటు, మండల స్థాయి, జిల్లాస్థాయి విద్యాశాఖ అధికారులకు వినతి పత్రాలు సమర్పించారు. దీంతో శుక్రవారం పాఠశాల వద్దకు జిల్లా విద్యాశాఖ అధికారి,, మండల స్థాయి అధికారులు చేరుకొని విద్యార్థులు తల్లిదండ్రులతో చర్చ అనంతరం సమావేశం ఏర్పాటు చేశారు. సందర్భంగా డీఈవో మాట్లాడుతూ అవసరాల మేరకు విద్యాశాఖ కమిషనర్ తో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామన్నారు. విద్యాభివృద్ధికి సహకరిస్తే దత్తతకు తీసుకొని పిల్లలకు చదువులు పూర్తయ్యే వరకు అన్ని విధాలా సహకరిస్తామని హామీ ఇచ్చారు. 4,5, తరగతులు చదివే విద్యార్థులకు పోటీ పరీక్షలకు శిక్షణ ఇవ్వాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి పార్టీ అధ్యక్షుడు అన్నవరం సుధాకర్ రెడ్డి, విద్యాశాఖ అధికారులు రవిశంకర్, వంశీకృష్ణ, గ్రామ నాయకుడు వెంకటరమణారెడ్డి, సర్పంచ్ వెంకట శివప్రసాద్, దళితవాడ నాయకులు, బిఎస్ కర్ణ, చిన్న పుల్లయ్య, భాస్కర్, చంద్రాయుడు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## మాదిగ జాతి అభివృద్ధికి కృషి చేయండి.

తంబళ్లపల్లె జూన్ 20 ప్రభాతవార్త ః

ఎమ్మార్పీఎస్, ఎం ఎస్ పి నూతన కమిటీ సభ్యులు మాదిగజాతి అభివృద్ధికి కృషి చేయాలని ఎమ్మార్పీఎస్ అన్నమయ్య జిల్లా ఇంచార్జ్ కోటా డానియల్ సూచించారు. శుక్రవారం ఆయనతోపాటు తంబళ్లపల్లె ఇంచార్జ్ వేటా మల్లికార్జున ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడిగా ఎద్దుల గంగాధర్, ఉపాధ్యక్షుడిగా ప్రేమ్ నాథ్, ప్రధాన కార్యదర్శిగా మధు, కార్యదర్శిగా హరిబాబు, సంయుక్త కార్యదర్శిగా చిన్న శంకర, ప్రచార కార్యదర్శిగా వై వెంకట్ రమణ, కోశాధికారిగా శ్రీనివాసులు, గౌరవ అధ్యక్షులుగా లక్ష్మయ్య, శ్రీరాములు అదే విధంగా ఎంఎస్‌పి అధ్యక్షుడిగా తుడుం రెడ్డప్ప, ఉపాధ్యక్షుడిగా చిన్నప్ప, ప్రధాన కార్యదర్శిగా వెంకటరమణ, కార్యదర్శిగా హరి, సంయుక్త కార్యదర్శిగా గోవిందు, ప్రచార కార్యదర్శిగా పకీరప్ప, కోశాధికారిగా రవీంద్ర, గౌరవ అధ్యక్షురాలుగా కృష్ణమ్మలు ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు తమ ఎంపికకు సహకరించిన అందరికీ కృతజ్ఞతలు తెలుపుతూ అంబేద్కర్ ఆశయాలను కొనసాగిస్తామని అభినవ అంబేద్కర్ మందకృష్ణ మాదిగ అడుగుజాడలలో రాష్ట్ర, జిల్లా కమిటీ ఆదేశాల మేరకు మాదిగ జాతి అభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తామని ప్రమాణం చేశారు. ఈ కార్యక్రమంలో మండలంలోని ఎమ్మార్పీఎస్, ఎం ఎస్ పి నాయకులు పాల్గొన్నారు.



# వన్ ఫైల్, వన్ లైఫ్ అనే నినాదంతో రెవెన్యూ శాఖ పనిచేయాలి



రాయచోటి, జూన్ 20 ప్రభాత వార్త

వన్ ఫైల్ వన్ లైఫ్ నినాదంతో రెవెన్యూ శాఖ పనిచేయాలని పుట్టుక నుంచి మరణం వరకు ప్రతి అంశంలో ముడిపడిన శాఖ రెవెన్యూ శాఖ అని పరిపాలనకు వెన్నెముక లాంటివాళ్ళు రెవెన్యూ ఉద్యోగులని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి పేర్కొన్నారు. రాయచోటి కలెక్టరేట్ లోని పి జి ఆర్ ఎస్ హాల్ లో శుక్రవారం రెవెన్యూ డే వేడుకల కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి, జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, మదనపల్లి సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్, డిఆర్ఓ మనుసూదన్ రావు, ఆర్డీవో శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు. పరిపాలనకు వెన్నెముక లాంటి వారు రెవెన్యూ ఉద్యోగులని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి పేర్కొన్నారు. రెవెన్యూ సిబ్బందికి ఏ పని అప్పజెప్పిన పూరిస్ఫూర్తిలో శ్రమపెట్టి ఆలోచించి లక్ష్యాలను అందుకునే విధంగా పని చేస్తున్నారన్నారు. నేను ఈ జిల్లాకు వచ్చినప్పుడు నుంచి గమనిస్తున్నాను ఏ పని చెప్పిన ఆ పని యొక్క దిశ నిర్దేశం చేస్తే ఆ పనిని అనర్గళంగా పని పూర్తి చేసి లక్ష్యాలన్నీ చేరుకుంటున్నారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 26 జిల్లాల్లో ప్రభుత్వ పథకాల అమలు తీరులో చాలా పథకాలలో అన్నమయ్య జిల్లా మొదటి స్థానంలో ఉండడం గర్వించదగ్గ విషయమని, దీని వెనుక మీ అందరి కృషి కూడా ఉన్నదని తెలిపారు. ప్రజల నుండి వచ్చే రెవెన్యూ సమస్యలను పరిష్కరించేందుకు, రెవెన్యూ శాఖలో జాప్యం ఎక్కువగా ఉందని అపోహను తొలగించు కునేందుకు టెక్నాలజీని ఉపయోగించుకుని, ఎప్పటికప్పుడు శిక్షణ పొంది ప్రజల సమస్యలను పరిష్కరించి ప్రజలకు ఒక నమ్మకాన్ని కలిగించే విధంగా రెవెన్యూ శాఖ సిబ్బంది పనిచేయాలన్నారు. పరిపాలనలో రెవెన్యూ ఉద్యోగులు కీలక పాత్ర పోషిస్తున్నారు. పుట్టుకనుంచి మరణం వరకు ప్రతి అంశం రెవెన్యూ శాఖ ముడిపడి ఉంటుందన్నారు. ఈ సందర్భంగా సీనియర్ ఉద్యోగులను, పదవి విరమణ పొందిన రెవెన్యూ ఉద్యోగులను మరియు ఉత్తమ సేవలు అందించిన రెవెన్యూ శాఖ వివిధ హోదాలలో పనిచేస్తున్నవుటువంటి సిబ్బందికి ప్రశంసా పత్రము , శాలువా లతో జిల్లా కలెక్టర్ సన్మానించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, మదనపల్లి సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్, డిఆర్ఓ మనుసూదన్ రావు, రాయచోటి ఆర్డీవో శ్రీనివాసులు, రాయచోటి తహసిల్దార్ నరసింహ కుమార్, కలెక్టరేట్ ఉద్యోగులు, తహసీల్దార్లు, రెవెన్యూ ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

# రాయచోటి మోటికట్ల హైస్కూల్ నూతన బస్సు సర్వీస్ ప్రారంభం




సంబేపల్లి జూన్ 20 ప్రభాతవార్త

రాయచోటి నుండి మోటకట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ప్రారంభమైన నూతన బస్ సర్వీస్‌ను మోటకట్ల హైస్కూల్ నందు తెదేపా నాయకులు శివారెడ్డి శుక్రవారం ఉదయం జండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నూతన సర్వీస్ ఉదయం 7 గంటల 45 నిమిషాలకు రాయచోటి నుండి ప్రారంభమై వయా నారాయణరెడ్డిపల్లి, ఎన్టీఆర్ కాలనీ, ముదినేని వడ్డేపల్లి మీదుగా మోటకట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వరకు ఉంటుందన్నారు. విద్యార్థులకు ఎటువంటి అడ్డంకులు లేకుండా చదువుకునేందుకు కూటమి ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటుందన్నారు. అడిగిన వెంటనే బస్సు సౌకర్యం కల్పించిన మంత్రివర్యులు మండిపల్లి రాంప్రసాద్ రెడ్డికి ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు. అనంతరం ఈ పాఠశాలను దత్తత తీసుకున్న డైట్ సీనియర్ లెక్చరర్ మడితాటి నరసింహారెడ్డి మాట్లాడుతూ ఈ పాఠశాలకు నారాయణరెడ్డిపల్లి, ఎన్టీఆర్ నగర్, ముదినేని వడ్డేపల్లి తదితర ప్రాంతాల నుండి విద్యార్థులు రావడం జరుగుతూ ఉందన్నారు. వీరందరికీ బస్ పాస్ లు జారీ చేసినప్పటికీ బస్సు సౌకర్యం లేకపోవడం వల్ల ప్రమాదకరంగా ఆటోలలో ప్రయాణించవలసి వచ్చేదన్నారు. అంతేకాక తగిన రవాణా సౌకర్యం లేకపోవడం వల్ల చాలామంది విద్యార్థులు ముఖ్యంగా బాలికలు డ్రాప్ అవుట్స్ అవుతున్నారన్నారు. తాను దత్తత తీసుకున్న ఈ పాఠశాలలో 3వ తరగతి నుండి 10వ తరగతి వరకు ఆంగ్ల మాధ్యమంలో నాణ్యమైన విద్యను అందించడం జరుగుతుందన్నారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం ద్వారా విద్యార్థులకు మంచి పౌష్టికాహారాన్ని అందజేయడం జరుగుతూ ఉందన్నారు. విద్యార్థులకు అవసరమైన యూనిఫామ్, నోట్ పుస్తకాలు, పాఠ్యపుస్తకాలు సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్ ద్వారా అందజేయడం జరుగుతూ ఉందన్నారు. ప్రతి తరగతిలో డిజిటల్ పరికరాలను ఉపయోగించి విద్యార్థులకు అర్థమయ్యేలా పాఠ్యాంశాలను బోధించడం జరుగుతూ ఉందన్నారు. విద్యా హక్కు చట్టం ప్రకారం డ్రాప్ అవుట్స్ తగ్గించడానికి బడి ఈడు పిల్లలందరిని టిసిలు లేకపోయినా పాఠశాలలో చేర్చుకుంటామన్నారు. బస్సు సౌకర్యం లేకుండా దూర ప్రాంతాల నుండి ప్రభుత్వ పాఠశాలలకు వచ్చే విద్యార్థులకు ట్రాన్స్ పోర్ట్ అలవెన్స్ కింద 6000 రూపాయలను ప్రభుత్వం అందిస్తుందన్నారు. ఈ సందర్భంగా ఉదయం సాయంత్రం వేళల్లో పాఠశాల పని వేళలకు అనుగుణంగా బస్సు సౌకర్యాన్ని కల్పించడం పట్ల విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. గతంలో తమ ఇండ్ల దగ్గరకు వచ్చే ప్రైవేటు పాఠశాలల బస్సుల ద్వారా వారి పాఠశాలలకు విద్యార్థులను పంపి ఆర్థికంగా ఇబ్బందులను ఎదుర్కొనే వారమన్నారు. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలకు బస్సు సౌకర్యం కల్పించడం వలన ఆర్థికంగా నష్టపోకుండా ఉండడానికి తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలకే పంపుతామన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు చప్పిడి పద్మజ, పంచాయతీ సెక్రెటరీ సురేష్, పేరెంట్స్ కమిటీ చైర్మన్ పెంచలమ్మ, సర్పంచ్ అమర్నాథ్ రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# హనుమంత వాహనం పై భక్తులకు దర్శనం ఇచ్చిన శ్రీవారు





బద్వేలు అర్బన్ ,జూన్ 20, ప్రభాతవార్త

బద్వేల్ పట్టణంలోని సిద్దవటం రోడ్డులో వెలసిన శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహితం శ్రీ వెంకటేశ్వర స్వామి, అభయాంజనేయ స్వామి దేవాలయం పంచమ వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం సాయంత్రం హనుమంత వాహనం పై పురవీధులలో భక్తులు స్వామివారు దర్శనం ఇచ్చారు. ఇందులో భాగంగా ఉదయం 6.30 గంటలకు చతుర్ధన అర్చన, లక్ష్మీనారాయణ హోమం, వేద స్వస్తి, తీర్థప్రసాద వినియోగములు కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం స్వామివారి ఊరేగింపు వెంట స్వామివారికి పలువురు భక్తులు మంచినీరు వారు పోసి కొబ్బరికాయ సమర్పించుకుని తమ మొక్కులను తీర్చుకున్నారు, ఆలయానికి వచ్చిన భక్తులకు ఆలయ కమిటీ నిర్వాహకులు వ్నల్ల కొండు వెంకటరమణ,జి, అంకయ్య, పెంచల రెడ్డి, సిద్దయ్య, బాలిరెడ్డి అంకయ్య, వెంకటసుబ్బయ్య, వెంకటరమణ, బండారు సురేష్ బాబు, కుప్పం సుధాకర్, అనీత్ సిరిగిరి నారాయణ, భార్గవ్ తో పాటు పలువురు కమిటీ సభ్యులు ప్రత్యేక ప్రసాదాలను అందజేశారు.

## బదిలీపై వెలుతున్న గురువులకు వీడ్కోలు



బదిలీపై వెళుతున్న ఉపాధ్యాయులకు వీడ్కోలు పలుకుతున్న సహ ఉపాధ్యాయులు

పీలేరు జూన్ 20 ప్రభాతవార్త :

పీలేరు పట్టణం, అయ్యప్ప రెడ్డి కాలనీలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో పనిచేస్తూ బదిలీపై వెళుతున్న ఐదుగురు ఉపాధ్యాయులను సహ ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా వీడ్కోలు పలికారు. శుక్రవారం స్థానిక పాఠశాల ఆవరణంలో ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని వేరువేరు ప్రాంతాలకు బదిలీపై వెళుతున్న ఉపాధ్యాయినులు జానం సుజాత (జీవశాస్త్రం), సంపూర్ణమ్మ (ఫిజికల్ డైరెక్టర్), శ్రీకళ (జీవశాస్త్రం), సౌజన్య (భౌతిక శాస్త్రం), విజయ కుమారి (సాంఘిక శాస్త్రం)లను శాలువాలు, పూలమాలలతో సత్కరించి తమ అభిమానాన్ని చాటుకుంటూ, విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం వారు అందించిన సేవలను గుర్తు చేసుకున్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయినీ ఫౌజియా బేగం అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఈ ఉపాధ్యాయులు తమ విధులల్లో నిబద్ధత చూపుతూ, విద్యార్థుల చైతన్యానికి, శ్రద్ధకు, శాస్త్రీయ ఆలోచనలకు బలం చేకూర్చారన్నారు. గత విద్యా సంవత్సరం 10వ తరగతి పబ్లిక్ పరీక్ష ఫలితాల్లో 92 శాతం ఉత్తీర్ణత సాధించడంలో వీరి పాత్ర ఎంతో ఉందని కొనియాడారు. వీరి సేవలు పాఠశాల చరిత్రలో చిరస్థాయిగా నిలుస్తాయని చెప్పారు. అనంతరం బదిలీ అయిన ఉపాధ్యాయులకు శాలువాలు కప్పి, గంధం పూసి, పూల మాలలతో ఘనంగా సన్మానించారు. జ్ఞాపికలు అందజేసి వారికి కృతజ్ఞతలు తెలుపుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల బోధన సిబ్బంది వై. విజయ కుమారి, ఇంద్రాణి, స్వప్నలత, ప్రసన్న లక్ష్మి, ఉమ, దీప, గంగయ్య, రామరాజు, బోధనేతర సిబ్బంది హారిక, అంజమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే ఇటీవలే పాఠశాలకు బదిలీపై వచ్చిన ఉపాధ్యాయులు రేణుక, మనోరంజని, సుబ్రహ్మణ్య కుమారి, నాగరాణి, వసంత, లోకనాథ రెడ్డిలకు ఉత్సాహంగా స్వాగతం పలికారు.

# మలేరియా నిర్మూలన ధ్యేయం

కేవీపల్లి జూన్ 20 ప్రభాతవార్త:

దేశంలో మలేరియాను పూర్తిగా నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ చేయూతనివ్వాలని కంభంవారి పల్లి మండలం గర్నిమిట్ట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి డాక్టర్ రేష్మ పేర్కొన్నారు. మలేరియా నివారణ మాసోత్సవాలలో భాగంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన అవగాహన సమావేశంలో ఆమె మాట్లాడుతూ మలేరియా ఆడ అనాపిలస్ దోమకాటు వలన వస్తుందని, సాధారణంగా జూన్ నెల నుండి అక్టోబర్ నెల మధ్యకాలంలో ఎక్కువగా వ్యాప్తి చెందుతుందని తెలియజేశారు. రోజు విడిచి రోజు జ్వరం రావడం, వణుకుతో కూడిన చలి జ్వరం మరియు చెమటలు పట్టుట, తలనొప్పి, ఒంటి నొప్పులు, రక్తహీనత లాంటివి మలేరియాలో లక్షణాలని, ఎవరైనా ఎలాంటి జ్వరంతోనైనా బాధపడుతున్నచో సమీప ఆరోగ్య కేంద్రానికి వెళ్లి వ్యాధి నిర్ధారణ కొరకు రక్త పరీక్ష చేయించుకోవాలని సూచించారు. వైద్యురాలు డాక్టర్ అర్చన మాట్లాడుతూ దోమకాటుకు గురి కాకుండా దోమతెరలు వాడాలని, ఇంటి ద్వారాలకు, కిటికీలకు మెష్ బిగించాలని, ఇంటి లోపల మరియు బయట నీటినిల్వలు లేకుండా జాగ్రత్త వహించాలని తెలిపారు. నీటి తొట్టెలను వారానికి ఒకసారి ఖాళీ చేసి ఆరబెట్టి మళ్లీ తాజా నీరు నింపుకోవడం ద్వారా దోమ లార్వాలను నిర్మూలించవచ్చునని తెలియజేశారు. ఇంటి ఆవరణలో తాగేసిన కొబ్బరి బొండాలు, వాడి పడేసిన టైర్లు, వాడకంలో లేని రోళ్ళు ఉంచరాదని, ఇంటిపై వాటర్ ట్యాంకులకు మూతలు బిగించాలని, గాలి గొట్టాలకు ఇనుప జాలీలు బిగించాలని, దోమతెరలు వాడాలని సూచించారు. కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ అధికారి ముజీబ్ భాషా, సామాజిక ఆరోగ్య అధికారిణి భాగ్యలక్ష్మి, పబ్లిక్ హెల్త్ నర్స్ రమాదేవి, సూపర్ వైజర్స్ రుక్మిణి, పురుషోత్తం, హెల్త్ అసిస్టెంట్స్ వెంకటరత్నం, రహీన బేగం, ఫార్మసిస్ట్ రమణి, ల్యాబ్ టెక్నీషియన్ స్వర్ణలత మరియు ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.




## వ్యవసాయ మార్కెట్ యార్డు స్థలాన్ని పరిశీలన

కె.వి పల్లి జూన్ 20 ప్రభాతవార్త :

కె.వి పల్లి మండలం పీలేరు పించా రహదారి పక్కనున్న వ్యవసాయ రైతు మార్కెట్ యార్డ్ స్థలాన్ని పరిశీలించిన పీలేరు వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ పురం రామ్మూర్తి, వైస్ చైర్మన్ పి సురేందర్ రెడ్డి, కె.వి పల్లి మండలం తహాశీల్దార్ వరప్రసాద్, వీఆర్వో వెంకటరమణారెడ్డి తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి పీలేరు నియోజకవర్గ శాసనసభ్యులు నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు కె.వి పల్లి మండలం, పంచాయతీలో నున్న రైతు మార్కెట్ యార్డ్ స్థలాన్ని పరిశీలించి మండలంలో ఉన్న రైతులకు అందుబాటులో కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని సందర్శించారు అనంతరం అక్కడ ఉన్న స్థలాన్ని పరిశీలించి చుట్టూ ప్రహరీ గోడ నిర్మించి రైతులకు అన్ని విధాలుగా అందు బాటులో కార్యాలయం నిర్మించాలని మండలంలో ఉన్న రైతులకు సకాలంలో అన్ని విధాలుగా అండగా ఉంటూ ప్రభుత్వం తరఫున కార్యకలాపాలు చేపట్ట నున్నట్లు తెలిపారు.



## రెవెన్యూ వెల్ఫేర్ పెట్రోల్ ఫిల్లింగ్ స్టేషన్‌ను ప్రారంభించిన జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి



రాయచోటి జూన్ 20 ప్రభాతవార్త

జూన్ 20న రెవెన్యూ డే సందర్భంగా రాయచోటిలోని ఎస్పీ ఆఫీసు పక్కన నూతనంగా నిర్మించిన రెవెన్యూ వెల్ఫేర్ పెట్రోల్ ఫిల్లింగ్ స్టేషన్ ను జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రెవెన్యూ డే రోజున రెవెన్యూ వెల్ఫేర్ పెట్రోల్ ఫిల్లింగ్ స్టేషన్ ను ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. ఐఓసీఎల్ మరియు అన్నమయ్య జిల్లా రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో రెవెన్యూ వెల్ఫేర్ పెట్రోల్ ఫిల్లింగ్ స్టేషన్ ను రాయచోటిలో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ పెట్రోల్ బంక్ ద్వారా పదిమందికి ఉపాధి అవకాశాలు వస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, డిఆర్ఓ మధుసూదనరావు, మదనపల్లి సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్, రాయచోటి ఆర్డీవో శ్రీనివాస్, రాయచోటి తాసిల్దార్ నరసింహ కుమార్, ఐఓసీఎల్ ప్రతినిధులు జయంత్ కుమార్, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

## ముక్కా సాయి వికాస్ రెడ్డిని కలిసిన తాసిల్దార్

ఓబులవారిపల్లి, జూన్ 20, ప్రభాతవార్త



ఓబులవారిపల్లి మండలం తాసిల్దార్ యామిని రెడ్డి మరి కొంతమంది తాసిల్దార్లు రైల్వే కోడూరు టిడిపి ఇన్చార్జి కూడా చైర్మన్ ముక్కారూపానంద రెడ్డి కుమారుడు టిడిపి యువ నాయకులు ముక్కా సాయి వికాస్ రెడ్డిని ఆయన నివాసము లో శుక్రవారం ఓబులవారిపల్లి తాసిల్దార్ యామిని రెడ్డి మరియు నియోజకవర్గంలో ఉన్న పలువురు తాసిల్దారులు మర్యాదపూర్వ కలిసి ఆయనకు పుష్పగుచ్చం ఇచ్చి పలకరించారు అన్ని విధాల బాధ్యతాయుతంగా పేద ప్రజలకు అందుబాటులో ఉండి విధి నిర్వహణలో మంచిగా పనులు చేసి ప్రజలకు అందుబాటులో ఉండి ఎప్పటికప్పుడు ప్రజా సమస్యల పరిష్కరించాలని ఆయన సూచించారు ఈ కార్యక్రమంలో పలువురు రెవెన్యూ అధికారుల సిబ్బంది పాల్గొన్నారు.

## బాలికలకు సైబర్ క్రైమ్ ల పై అవగాహన



పోరుమామిళ్ల రూరల్, జూన్ 20 ప్రభాతవార్త:

పోరుమామిళ్ల సిఐ డి. శ్రీనివాసులు పోరుమామిళ్ల మండలం లోని కస్తూరిభా బాలికల పాఠశాల ను శుక్రవారం సందర్శించారు. బాలికలకు సైబర్ క్రైమ్‌ల పైన బాల్య వివాహాలులపై, డయల్ 100,112,1098, చట్టం మొదలగు విషయాలపై అవగాహనా సదస్సు నిర్వహించారు.

## ప్రతి ఒక్కరూ అంకితభావంతో విధులను నిర్వర్తించాలి



రెవెన్యూ దినోత్సవం సందర్భంగా కేక్ కోస్తున్న పీలేరు తహశీల్దారు

పీలేరు జూన్ 20 ప్రభాతవార్త

రెవెన్యూ సిబ్బంది ప్రతి ఒక్కరూ తమ విధుల్లో అంకిత భావం చూపాలని పీలేరు తహశీల్దారు శివ కమార్ తెలిపారు. శుక్రవారం స్థానిక తహశీల్దారు కార్యాలయంలో రెవెన్యూ దినోత్సవం సందర్భంగా రెవెన్యూ ఉద్యోగులు, సిబ్బందితో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించి కేక్ కోసి సంబరాలు చేసుకున్నారు. ముందుగా తహశీల్దారు శివకమార్ సిబ్బంది చేత ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రెవెన్యూ ఉద్యోగులు సిబ్బంది తమ దగ్గరికి వచ్చే ప్రజలు, రైతుల పట్ల మర్యాద పూర్వకంగా వ్యవహరించాలని సూచించారు. ధ్రువపత్రాలు, ఇతర అవసరాల కోసం వచ్చే విద్యార్థులు, రైతులను కార్యాలయం చుట్టూ తిప్పకుండా సకాలంలో వాటిని పూర్తి చేసి వారికి సహకరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఉద్యోగులతో పాటు సచివాలయ ఉద్యోగులు, వీఆర్ఓలు, వీఆర్ఏలు, తదితరులు పాల్గొన్నారు.

## వీరబ్రహ్మేంద్రస్వామి మఠంలో హుండీ లెక్కింపు



బ్రహ్మంగారిమఠం జూన్ 20 ప్రభాతవార్త

ప్రముఖ పుణ్యక్షేత్రమైన జగద్గురు శ్రీమద్విరాట్ పోతులూరు శ్రీ శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి వారి భక్తులు కానుకల ద్వారా సమర్పించిన హుండీలను మఠం ప్రాంగణంలో లెక్కించగా 31,45,884 రూపాయలు ఆదాయం వచ్చినట్లు, అలాగే 13 గ్రాములు బంగారం, 280 గ్రాములు వెండి వచ్చినట్లు ఫిట్ పర్సన్ శంకర్ బాలాజీ, మేనేజర్ ఈశ్వరయ్య ఆచారి తెలిపారు. జిల్లా అసిస్టెంట్ కమిషనర్ మల్లికార్జున, పూర్వపు మఠాధిపతి కుమారులు వీరంభట్లయ్య, దత్తాత్రేయ, గోవింద స్వామి,సమక్షంలో నిర్వహించారు. ఈ లెక్కింపు కార్యక్రమంలో భక్తులు, సేవా సంస్థలు, బ్యాంకు సిబ్బంది, మఠం సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రీ సీతారాముల కళ్యాణం మహోత్సవం..

సుండుపల్లె, జూన్ 20, ప్రభాతవార్త :

మండల పరిధిలోని ముడుంపాడు గ్రామం పిచ్చా ప్రాజెక్ట్ పై వెలసిన శ్రీ శ్రీ శ్రీ ప్రసన్న ఆంజనేయ స్వామి తిరుణాలలో భాగంగా శుక్రవారం సాయంత్రం అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నాగేంద్ర నాయక్ దంపతులు ప్రాజెక్ట్ ఇరువురు శ్రీ సీతారాముల కళ్యాణం జరిపించారు. భక్తులందరూ స్వామివారికి అర్చన పూజా కార్యక్రమాలు చేశారు.



## యోగాంధ్రపై అవగాహన ర్యాలీ




రాయచోటి, జూన్ 20 ప్రభాతవార్త

అన్నమయ్య జిల్లా రాయచోటి పట్టణంలో శుక్రవారం నాడు శ్రీ సాయి ఇంజనీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం "యోగాంధ్ర"పై ప్రజలలో అవగాహన కల్పించేందుకు భారీ ర్యాలీను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అన్నమయ్య జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గెస్ట్ ఆఫ్ హానర్గా విచ్చేసిన రాయచోటి ఆర్డీఓ శ్రీనివాసులు జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ, "అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ప్రతి ఒక్కరూ విజయవంతం చేయడానికి తమ భాగస్వామ్యాన్ని అందించాలి. యువత ఈ తరహా ఆరోగ్యకర కార్యక్రమాలలో చురుకుగా పాల్గొనాలి" అని తెలిపారు. కళాశాల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ, "యోగ అనేది దివ్యమైన ఔషధం. ఇది మన జ్ఞానేంద్రియాలు, కర్మేంద్రియాలను నియంత్రించి, మనస్సును శుద్ధి చేస్తుంది. యోగ సాధన ద్వారా వాక్శుద్ధి, కర్మశుద్ధి లభిస్తాయి. దీన్ని అనుసరిస్తే ఉత్తమ వ్యక్తిత్వం మరియు మానసిక ప్రశాంతత సాధ్యమవుతాయి" అని వివరించారు. ర్యాలీ బస్టాండ్ సర్కిల్, కంసలి వీధి, ఠానా కూడలివద్దగా సాగి బంగ్లా సర్కిల్ వద్ద ముగిసింది. అనంతరం జాయింట్ కలెక్టర్ విద్యార్థులతో ఆరోగ్య భారత్ సాధన కోసం ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు హరినాథ్ రెడ్డి, మొహమ్మద్, వాసవి యోగా కేంద్ర సభ్యులు కూనా కృష్ణదేవరాయులు, యోగా గురు సుదర్శన్, అర్చన విద్యాసంస్థల కరస్పాండెంట్ మదన్ మోహన్ రెడ్డి, వీఆర్ విద్యార్థులు, కళాశాల ప్రిన్సిపల్ డా. వి. బాలాజీ, వైస్ ప్రిన్సిపల్ డా. వి. వెంకటరమణ, విభాగాధిపతులు, అధ్యాపకులు, ఇతర కళాశాలల విద్యార్థులు, పట్టణ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అంతర్జాతీయ యోగాంధ్ర స్ఫూర్తిగా జలాసనాలు

ప్రొద్దుటూరు అర్బన్, జూన్ 20 ప్రభాతవార్త :



అంతర్జాతీయ యోగా దినోత్సవ సందర్భంగా జలయోగాంధ్ర స్ఫూర్తిగా కృష్ణమ్మ మురిసేలా కృష్ణాజిల్లా నాగయలంకలో ఈనెల 18 తేదీన నిర్వహించిన ఆ సనాలను ప్రేరణగా పెన్నమ్మ మురిసేల 74 ఏళ్ల సాహితీవేత్త జింకా సుబ్రమణ్యం శుక్రవారం పెన్నా నది ఒడ్డున గల స్విమ్మింగ్ పూల్‌లో జల ఆసనాలను ప్రదర్శించారు. పతంజలి అష్టాంగ సూత్రాలలో యోగాసనాలు చాలా ముఖ్యమైనవని వీటివల్ల శరీరము మనస్సు సమతుల్యత ఏర్పడి మనిషికి ఆరోగ్యాన్ని ఆనందాన్ని ఉత్సాహాన్ని ఉల్లాసాన్ని కలిగిస్తాయన్నారు. ఆసనాలు వేయడం వల్ల మనిషి ఒత్తిడి తగ్గి మనసు ప్రశాంతంగా ఉంటుందని అందుకే మనిషి జీవితంలో వ్యాయామాన్ని జీవనశైలిగా మార్చుకోవాలన్నారు. గత 20 సంవత్సరాలుగా స్విమ్మింగ్ అసోసియేషన్ స్థాపించి ప్రొద్దుటూరు స్విమ్మింగ్ పూల్‌లో ఎంతో మంది విద్యార్థులకు శిక్షణ ఇవ్వడమే గాక ఆసనాలు నేర్పిస్తున్నామని దీనివల్ల విద్యార్థులకు జ్ఞాపకశక్తి ఏకాగ్రత అలవాటుతోందని వారు ఎంతో చురుకుగా ఉల్లాసంగా ఉంటారని అన్నారు. శుక్రవారం ఉదయం రామేశ్వరం పెన్నా నది ఒడ్డునగల స్విమ్మింగ్ పూల్ లో వివిధ రకములైన ఆసనాలను నీటిలో వేయడం జరిగింది అందులో పద్మాసనం, శవాసనం, ప్రణవాసనం,వృక్షాసనం, పవనముక్తాసనం మొదలైనవి వేయడం జరిగిందన్నారు.

## ప్రపంచంలో భారత్ తలెత్తుకునేలా మోడీ పాలన



రాజంపేట జూన్ 20 ప్రభాతవార్త

ప్రపంచ దేశాల్లో భారత్ తల ఎత్తుకునేలా తన 11 సంవత్సరాల పాలనలో మోడీ ఎంతో ప్రభావశీలంగా పరిపాలన నిర్వహించారని బిజెపి జిల్లా అధ్యక్షుడు సాయి లోకేష్ అన్నారు. శుక్రవారం రాజంపేట మండలం మన్నూరు అరుంధతి వాడలో కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రధానిగా బాధ్యతలు చేపట్టి 11 సంవత్సరాల పూర్తి అయిన సందర్భంగా ఏర్పాటు చేసిన గ్రామ సభ కు ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా భాజపా అధ్యక్షులు సాయిలోకేష్ మాట్లాడుతూ భారతదేశం అన్ని రంగాల్లో ముందుకివెళుతున్నదన్నారు. మహిళా భద్రత కు సంబందించి డ్వాక్రా ద్వారా లోన్స్ ఇవ్వడమే కాక గర్భం దాల్చిన మహిళ బిడ్డ పుట్టక వరకు ఉచితంగా మందులు ఇవ్వడమే కాక ప్రసవం సమయానికి ఇక్కడి నుంచి హాస్పిటల్ తీసుకోవడం డెలివరీ చేయడం ,ప్యాకెట్ మనీ ఇచ్చి ఇంటికి సురక్షితంగా చేర్చడం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యదర్శి నాగోతు రమేష్ నాయుడు, జిల్లా ఉపాధ్యక్షులు సురేష్ రాజు, ప్రధాన కార్యదర్శి కృష్ణ యాదవ్ ,రాష్ట్ర మైనార్టీ మోర్చా ఉపాధ్యక్షులు షబ్బీర్ అహ్మద్, జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు సునీత నారాయణ వర్మ, కార్యక్రమా కో కన్వీనర్ చీ చీరలశ్రీనివాస్ యాదవ్, స్థానిక నాయకులు కృష్ణయ్య, ప్రభావతి, నరేంద్ర రాజు, పట్టణ అధ్యక్షులు రమణ తదితరులు పాల్గొన్నారు.

## గుట్టపాలెంలో యోగా..

కలికిరి, జూన్ 20, ప్రభాతవార్త:

కలికిరి మండలం గుట్టపాలెం గ్రామంలో శుక్రవారం గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారిణి ఆర్.అరుంధతి ఆధ్వర్యంలో సచివాలయ సిబ్బంది మరియు గ్రామ ప్రజలు యోగా నిర్వహించడం జరిగింది. యోగా ఉద్దేశం అందరూ ఆరోగ్యంగా ఉంటూ ఆసుపత్రులకు వెళ్లకుండా ప్రతి రోజు 30 నిమిషాలు యోగా చేయడం వల్ల అవుతుందని అరుంధతి తెలిపారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ తిమ్మారెడ్డి, నిర్మల, దశరథ, సచివాలయంలోని అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు, ఆశా వర్కర్లు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## జూనియర్ అసిస్టెంట్ నాగేంద్రకు ప్రశంసాపత్రం

పీలేరు జూన్ 20 ప్రభాతవార్త :

రెవెన్యూ దినోత్సవాన్ని సందర్భంగా పీలేరు తహసిల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ గా పనిచేస్తున్న నాగేంద్రకు జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ చేతుల మీదుగా ఉత్తమ జూనియర్ అసిస్టెంట్‌గా ప్రశంసా పత్రాన్ని అందుకున్నట్లు ఆయన శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా నాగేంద్ర మాట్లాడుతూ విధి నిర్వహణలో భాగంగా అంకితభావంతో పనిచేస్తూ ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించినందుకు, ఉన్నత అధికారుల ఆదేశాలకు అనుగుణంగా పనిచేయడం వల్లనే ప్రశంసా పత్రాన్ని అందుకున్నట్లు ఆయన తెలిపారు. ఇకనుంచి కూడా అధికారుల ఆదేశాలతో ప్రజలకు అనుగుణంగా నా వంతు పనిచేయటానికి ముందుంటానని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, రెవిన్యూ ఆఫీసర్ పలువురు రెవెన్యూ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.



జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకుంటున్న నాగేంద్ర